


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
PEN POWER TELUGU DAILY
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 192 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ బుధవారం 19 మార్చి 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :192 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA WED 19 MARCH 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada,Visakhapatnam, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటోలను పంచుకున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

- ఏపీ అసెంబ్లీలో ఫొటో షూట్
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కూడా హాజరయ్యారన్న రఘురామకృష్ణరాజు
- నెట్టింట ఫొటోల సందడి



**పెన్ పవర్ డెస్క్:**అసెంబ్లీలో ఎమ్మెల్యేలందరూ గ్రూప్ ఫొటో దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ ఫొటోల్లో ఉన్నారు. ఈ ఫొటో షూట్ పై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. అసెంబ్లీ ఆవరణలో ఈరోజు ఎమ్మెల్యేలు అందరూ గ్రూప్ ఫొటో తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఇది ప్రజాస్వామ్య ప్రయాణానికి గుర్తుగా, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ ప్రత్యేక ఫొటో సెషన్ లో పాల్గొన్నారని రఘురామకృష్ణరాజు వివరించారు. ఈ ఫొటోలో ప్రతిబింబించిన ఐక్యత, బాధ్యత, ప్రజలకు అందించే సేవల పట్ల నిబద్ధత మన ప్రజాస్వామ్య వ్యవస్థ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్యేల గ్రూప్ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. అటు, ఎమ్మెల్సీలతోనూ చంద్రబాబు, పవన్, లోకేశ్ గ్రూప్ ఫొటో దిగారు. ఈ ఫొటోలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూడా ఉన్నారు.

## విజయవాడలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభం

- ఇందిరాగాంధీ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు
- క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి 13 అంశాల్లో మూడు రోజుల పాటు పోటీలు
- బహుమతి ప్రదానం చేయనున్న సీఎం చంద్రబాబు



**పెన్ పవర్ డెస్క్:**ఏపీలో మూడు రోజుల పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ ఆటల పోటీలు జరగనున్నాయి. ఈ మధ్యాహ్నం ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు అనిత, నాదెండ్ల మనోహర్ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొని ప్రజాప్రతినిధుల క్రీడా పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర క్రీడల మంత్రి మండిపల్లి వివరాలు 2లో..

## తక్కువ ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రాలలో నాలుగో స్థానంలో ఏపీ

- మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల కమిటీ సమావేశం
- హాజరైన నాదెండ్ల, అచ్చెన్నాయుడు, పయ్యావుల, సత్యకుమార్
- అధికారులకు దిశానిర్దేశం



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సచివాలయంలో మార్కెట్ ధరల పర్యవేక్షణపై మంత్రుల బృందం సమావేశమైంది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆహారం, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు వివరాలు 2లో..

## ఈ నెలాఖరు నాటికి వాట్సాప్ ఈ-గవర్నెన్స్ లో

# 300 రకాల సేవలు

- గతంలో చంద్రబాబు పౌరసేవలను ఈ-సేవగా మార్చారన్న లోకేశ్
- యువగళం పాదయాత్రతో ప్రజాసమస్యలు పూర్తిగా అర్థం చేసుకున్నానని వెల్లడి
- అందుకే వాట్సాప్ ఈ-గవర్నెన్స్ తీసుకువచ్చామని వివరణ



**పెన్ పవర్ డెస్క్:**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తీసుకువచ్చిన వాట్సాప్ ఈ-గవర్నెన్స్ విధానంపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. వాట్సాప్ ఈ-గవర్నెన్స్ ద్వారా 200 రకాల పౌరసేవలు అందించగలుగుతున్నామని, సర్టిఫికెట్ల జారీ ఎంతో సులభంగా మారిందని తెలిపారు. మార్చి నెలాఖరు నాటికి 300 పౌరసేవలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. గతంలో చంద్రబాబు పౌరసేవలను ఈ-సేవగా మార్చి ప్రజలకు వద్దకు పాలన తీసుకువెళ్లారని తెలిపారు. తాను గతేడాది నిర్వహించిన యువగళం పాదయాత్ర ద్వారా, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిగా అర్థం చేసుకున్నానని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి సేవలు అందుకోవాలంటే గతంలో ప్రజలు చేతులు కట్టుకుని నిల్చోవాల్సిన పరిస్థితి ఉండేదని అన్నారు. ఈ పద్ధతి కాకుండా, సులభతరంగా పౌరసేవలు అందించాలని నిర్ణయించామని... అందులో భాగంగా వాట్సాప్ ఈ-గవర్నెన్స్ తీసుకువచ్చామని మంత్రి నారా లోకేశ్ వివరించారు.

## వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు..

- అంతరిక్షం నుండి తిరిగివస్తున్న సునీతా విలియమ్స్‌కు ప్రధాని మోదీ లేఖ
- అంతరిక్షంలో తొమ్మిది నెలలు గడిపిన సునీతా విలియమ్స్
- ఎట్టకేలకు భూమికి తిరిగివస్తున్న వైనం
- భారత ప్రజల హృదయాలలో సునీతా విలియమ్స్ స్థానం ప్రత్యేకమన్న మోదీ
- ఆమె ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు లేఖలో వెల్లడి

వివరాలు 2లో..



## అప్పుడు జగన్ చేసిన తప్పే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు

- ఇటీవల వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి వైఎస్సార్ కడప జిల్లాగా మార్పు
- తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగింపు
- తీవ్రస్థాయిలో స్పందించిన షర్మిల



**పెన్ పవర్ డెస్క్:**ఇటీవల ఏపీలోని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా పేరును తిరిగి వైఎస్సార్ కడప జిల్లాగా మార్చడం, కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తొలగించడం తెలిసిందే. దీనిపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో స్పందించారు. సీఎం చంద్రబాబు తీరు అత్త మీద కోపం దుత్త మీద చూపినట్టుగా ఉందని విమర్శించారు. అప్పుడు జగన్ చేసిన తప్పే నేడు చంద్రబాబు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ అధికారంలో ఉండగా స్వర్గీయ ఎన్టీఆర్ పేరు మార్చి వైసీపీ ప్రభుత్వం అభిమానుల మనోభావాలు దెబ్బతినేలా చేస్తే.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మహానేత వివరాలు 2లో..

## యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు

- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- 18 మంది సభ్యులతో వైటీడీ ట్రస్టు బోర్డు ఏర్పాటు
- వారికి జీతభత్యాలు ఉండవన్న మంత్రి కొండా సురేఖ
- ఐఏఎస్ అధికారి ఈవోగా వ్యవహరిస్తారని వెల్లడి



**పెన్ పవర్ డెస్క్:**యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దేవాదాయ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పద్దెనిమిది వివరాలు 2లో..

## బెట్టింగ్ ఊబిలో యువత

### అప్రమత్తంగా ఉండాలంటున్న సీనియర్ ఐపీఎస్ సజ్జనార్



**పెన్ పవర్ డెస్క్:**బెట్టింగ్... ఈ పేరు వింటేనే ఎంతో మంది జీవితాలు ఛిద్రమైన ఉదంతాలు గుర్తుకు వస్తాయి. క్షణికావేశంలో, సు లువుగా డబ్బు సంపాదించాలనే అత్యా శతో ఈ వ్యసనంలో కూరుకుపోయి, ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలు ఎన్నో. ముఖ్యంగా యువత దీని బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై సీనియర్ ఐపీఎస్ అధికారి సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించే యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు. వివరాలు 2లో..

## ప్రాజెక్టులపై తెలంగాణ పిటిషన్.. కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

- కృష్ణా నది ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం రిట్ పిటిషన్
- సుప్రీంకోర్టులో విచారణ
- రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు నోటీసులు



**పెన్ పవర్ డెస్క్:**కృష్ణా నదీ ప్రాజెక్టుల అంశంపై తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. వివరాలు 2లో..

## ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాల పిలుపు



- కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యల సమావేశం
- సమ్మెపై రెండు నెలల పాటు ప్రచారం
- లేబర్ కోడ్ రద్దు, నెలవారీ కనీస వేతనం సహా వివిధ డిమాండ్లతో సమ్మె

**పెన్ పవర్ డెస్క్:**ప్రైవేటీకరణను నిలిపివేయడంతో పాటు పలు డిమాండ్లతో మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు వివిధ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జాతీయ సమావేశం జరిగింది. దేశవ్యాప్త సమ్మెపై రెండు నెలల పాటు ప్రచారం నిర్వహించాలని కార్మిక సంఘాలు నిర్ణయించాయి.దలేబర్ కోడ్ రద్దు చేయడం, ఇండియన్ లేబర్ ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపడం, నెలవారీ కనీస వేతనం రూ. 26,000, ఉద్యోగుల పెన్షన్ పథకం కింద నెలవారీ వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# వెల్ కమ్ టూ సునీత....

సునీతా విలియమ్స్.. ఇప్పుడు ప్రపంచం మొత్తం ఆమె రాక కోసం ఎదురుచూస్తోంది. వారం రోజుల కోసమని అంతరిక్షంలోకి వెళ్లిన ఆమె.. 9 నెలల తర్వాత భూమి మీదకు రానున్నారు. ఐఎస్ఎస్‌తో.. నాసా క్రూ-10 మిషన్ డాకింగ్ ప్రక్రియ కూడా విజయవంతమైంది. దాదాపు 300 రోజుల తర్వాత ఆవిడ తిరిగి వచ్చారు గతేడాది అంతరిక్షంలోకి వెళ్లిన సునీత విలియమ్స్.. దాదాపు 300 రోజుల తర్వాత దివి నుంచి భువికి తిరిగిరానున్నారు. ఆమె రాక కోసం.. ఈ భూగోళమంతా ఎదురుచూస్తోంది. ఆవిడని తిరిగి రప్పించేందుకు.. నాసా చేపట్టిన క్రూ-10 మిషన్ డాకింగ్ ప్రక్రియ సైతం విజయవంతమైంది. అస్ట్రోనాట్స్.. కొత్త క్రూకు వెల్‌కమ్ చెప్పారు. ప్రస్తుతం ఐఎస్ఎస్‌లో 11 మంది అస్ట్రోనాట్స్ ఉన్నారు. 2 రోజుల పాటు హ్యాండోవర్ ప్రక్రియ పూర్తి కావడంతో బుధవారం సునీత విలియమ్స్.. భూమి మీదకు చేరుకున్నారు.సునీత విలియమ్స్.. అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారత సంతతి మహిళ. వ్యోమనౌకలో తలెత్తిన లోపాలతో.. ఆమె 9 నెలలుగా పైనే ఉండిపోయారు. గతేడాది జూన్ 5న సునీత అంతరిక్షంలోకి వెళ్లారు. తిరిగి అదే నెలలో భూమి మీదకు తిరిగి రావాల్సి ఉంది. కానీ.. అది జరగలేదు. సునీత స్పేస్‌లోకి వెళ్లి.. 280 రోజులు దాటింది. భూకక్ష్యకు సుమారు 400 కిలోమీటర్ల ఎత్తున ఉన్న ఇంటర్నేషనల్ స్పేస్ సెంటర్‌కి.. సునీతను, ఆమె సహ వ్యోమగామి బుచ్ విల్మోర్‌ని.. బోయింగ్ స్టార్‌లైనర్ విజయవంతంగా తీసుకెళ్లింది.వారిని అక్కడ దించేసిన తర్వాత.. అది పనిచేయడం మానేసింది. నాసా టీమ్ భూమి మీద నుంచి స్టార్‌లైనర్‌కు చేసిన రిపేర్లు కూడా పనిచేయలేదు. అలా.. వారం రోజుల కోసం వెళ్లి.. నెలల పాటు అంతరిక్షంలోనే ఉండిపోయిన సునీత విలియమ్స్.. ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ క్రూ-10 వ్యోమ నౌకను స్పేస్‌లోకి పంపారుసునీత స్పేస్ ఎపిసోడ్‌లో గమ్మత్తైన విషయం ఏమిటంటే.. స్టార్ లైనర్ స్పేస్ షిప్‌ని టెస్ట్ చేసేందుకు వెళ్లిన సునీత, విల్మోర్.. అదే స్టార్ లైనర్ పనిచేయకపోవడంతో.. అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఇప్పుడు.. వాళ్లిద్దరూ క్షేమంగా భూమి మీదకు దిగి రావాలని అంతా కోరుకుంటున్నారు. నెలల పాటు అంతరిక్షంలోనే ఉండిపోవడం వల్ల.. సునీత ఆరోగ్య కాస్త క్షీణించింది. ఆవిడ బరువు తగ్గిపోయినట్లుగా తెలుస్తోంది. అంతరిక్షంలో పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారని.. అందువల్ల బలహీనంగా కనిపిస్తున్నారని చెబుతున్నారు. దీర్ఘకాలంలో అంతరిక్షంలో ఉన్నవారికి.. స్పేస్ ఎనీమియా వస్తుంది. మైక్రో గ్రావిటీకి గురై.. ఎర్ర రక్తకణాల క్షీణత ఎక్కువగా ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు. అయితే.. ఇప్పటివరకు రిలీజైన ప్రతి ఫోటోలో.. సునీత ఆత్మవిశ్వాసంతో.. చిరునవ్వుతో కనిపించారు.అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన వ్యోమగాములను ఎలాగైనా భూమిపైకి తీసుకురావాలని నాసా విశ్వ ప్రయత్నాలు చేసింది. ప్రతిసారి ఏదో ఒక ఆటంకం ఏర్పడి.. పోస్ట్ పోన్ అవుతూ వచ్చింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ పగ్గాలు చేపట్టాక.. సునీతా విలియమ్స్, విల్మోర్‌ని.. భూమిపైకి తీసుకొచ్చే బాధ్యతను.. స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్‌కు అప్పగించారు. దాంతో.. వారి రాకపై ఓ క్లారిటీ వచ్చింది. మార్చి 19న నాసా క్రూ-10 మిషన్ ద్వారా.. వాళ్లిద్దరూ తిరిగి భూమికి వచ్చారు.9 నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత.. ఎన్నో అనుమానాలని పటాపంచలు చేస్తూ.. సునీత, విల్మోర్ భూమిపై కాలు మోపనున్నారు. సునీతా విలియమ్స్ భారతీయ మూలాలున్న మహిళ. ఆమె తండ్రి గుజరాతీ. తల్లి ఉర్సులిన్ స్లోవేనియన్ మహిళ. సునీత అంతరిక్షంలోకి వెళ్లడం ఇది మూడోసారి. కానీ.. ఆవిడ గతంలో ఎప్పుడూ ఇన్ని రోజుల పాటు అంతరిక్షంలో ఉండలేదు. ఇప్పుడు ఆవిడ క్షేమంగా భూమిపైకి తిరిగి రావాలని అంతా కోరుకుంటున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా.. మూలాల్ని మర్చిపోవద్దంటారు. ఈ విషయంలో.. సునీత విలియమ్స్ అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. భారతీయ మూలాలున్న ఆమె.. మన సంస్కృతిని, ఆధ్యాత్మికతను మర్చిపోలేదు. అంతరిక్షంలోకి వెళ్లినా.. భారతీయత గొప్పదనాన్ని చాటారు. ఇండియన్ యూత్‌కు.. స్ఫూర్తిగా నిలిచారు.అమెరికాలో పుట్టి పెరిగినా.. సునీతా విలియమ్స్ ఎప్పుడూ తన సాంస్కృతిక వారసత్వాన్ని మర్చిపోలేదు. ప్రతి మిషన్‌లో.. ఆమె తన భారతీయతని చాటే ప్రయత్నం చేసింది. ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కి భగవద్గీతను తీసుకెళ్లినా.. స్పేస్‌లోనే దీపావళిని జరుపుకున్నా.. ఆమె తన భారతీయ వారసత్వం పట్ల ఉన్న గౌరవాన్ని.. అనేక విధాలు ప్రదర్శించారు. బోయింగ్ స్టార్‌లైనర్‌లో అంతరిక్షంలోకి వెళ్లేటప్పుడు.. సమోసాలను తీసుకెళ్లారు.తనకెంతో ఇష్టమైన భారతీయ వంటకాల పట్ల.. ఆమెకున్న ప్రేమను వ్యక్తం చేశారు. అంతరిక్షంలో సునీతకు మరపురాని అనుభవం ఏదైనా ఉందంటే.. స్పేస్ స్టేషన్‌లో దీపావళి జరుపుకోవడమే. భారత్ నుంచి వలసెళ్లిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ.. దీపావళి జరుపుకున్నారు. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో దీపావళిని జరుపుకోవడం వల్ల.. భారతీయ వారసత్వంతో ఆమెకున్న కనెక్షన్ ఎంత గొప్పదో అందరికీ అర్థమైంది. సాంస్కృతిక మూలాల్ని.. ఆమె ఎప్పటికీ మర్చిపోదనే విషయం.. అప్పుడే తెలిసింది.సునీతా విలియమ్స్.. తన జీవితంలో ముఖ్యమైన మార్గదర్శకాలుగా ఉన్న భగవద్గీతని సైతం అంతరిక్షంలోకి తీసుకెళ్లారు. అందులోని బోధనలు.. ఆమెకు బలాన్ని, ఓదార్పును అందించాయని తెలిపారు. స్పేస్ స్టేషన్‌లో.. ఈ పవిత్ర గ్రంథాలు ఆమెకు శాంతిని చేకూర్చాయి. విశ్వంలోని సుదూర ప్రాంతాల్లోనూ లోతుగా పాతుకుపోయిన ఆధ్యాత్మికత.. ఎలాంటి మార్గదర్శకత్వాన్ని అందించగలదో సునీత చూపించారు. తన కెరీర్ అంతటా.. సునీత ఎంతోమంది భారతీయ యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె సక్సెస్ స్టోరీ.. చాలా మందికి సైన్స్, టెక్నాలజీ, అంతరిక్ష పరిశోధనల్లో కెరీర్ కొనసాగించేందుకు ప్రేరణనిచ్చింది. యువత.. తమని తాము బలంగా నమ్మలని.. అత్యున్నత శిఖరాలు చేరుకోవాలని ప్రోత్సహించారు. సునీత జర్నీ.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. అంకితభావం, కృషితో.. ఏదైనా సాధ్యమేనని నిరూపిస్తుంది.సునీత.. తన అంతరిక్ష ప్రయాణంలో.. వినాయకుడి విగ్రహాన్ని కూడా తీసుకెళ్లారు. గణపతి తన జీవితంలో మార్గదర్శిగా ఎలా ఉన్నాడో.. ఆమె వివరించారు. గణేశుడిని అంతరిక్షంలోకి తీసుకెళ్లడం ద్వారా.. సునీతా విలియమ్స్ తన భారతీయ మూలాలతో ఉన్న సంబంధాన్ని.. ఈ ప్రపంచానికి చాటి చెప్పింది. తన సంస్కృతి, ఆధ్యాత్మికతలో కొంత భాగాన్ని.. అంతరిక్షం దాకా మోసుకెళ్లింది. ఆమె ఎంత దూరం ప్రయాణించినా.. సాంస్కృతిక, ఆధ్యాత్మిక గుర్తింపు.. ఆమె ప్రయాణంలో ప్రధాన భాగంగా ఉందని తెలియజేసింది. ఈ చర్యలన్నింటితో.. భారతీయ వారసత్వంతో తనకున్న సంబంధాన్ని.. అంతరిక్షం నుంచి అందరికీ చాటి చెప్పింది సునీతా విలియమ్స్.

# బెట్టింగ్ ఊబిలో యువత

- మొదటి పేజీ తరువాయి
లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు సైతం కాసులకు కక్కుర్తిపడి బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తూ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనిపై స్పందించిన సజ్జనార్, బెట్టింగ్ యాప్‌ల ప్రచారం వల్ల అమాయక ప్రజల ప్రాణాలు తీయొద్దని విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ కొందరు వినిపించుకోకపోవడంతో వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా చేశారు. "చాలామంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నారు. దీనివల్ల సులువుగా డబ్బు సంపాదించవచ్చని అనుకుంటున్నారు. గత కొద్ది నెలలుగా నేను ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ ద్వారా బెట్టింగ్ యాప్‌లపై పోస్టులు పెడుతున్నాను. వైజాగ్ సీపీ గారు కూడా ఒక సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ మీద కేసు పెట్టారు. ఎవరూ చట్టానికి అతీతులు కారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తే క్రిమినల్ కేసులు తప్పవు. దీనివల్ల మీకున్న ఫాలోయింగ్ తగ్గిపోతుంది. కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. మీ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. బెట్టింగ్ యాప్‌లే కాదు, ఏ చట్టవిరుద్ధమైన, అనైతిక వ్యాపారాలను ప్రోత్సహించవద్దు" అని సజ్జనార్ హెచ్చరించారు. అప్పులు చేసి బెట్టింగ్‌లలో పాల్గొని, ఆపై వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న వారి గురించి ఆయన ప్రస్తావించారు. యువత బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల మాటలను నమ్మవద్దని కోరారు. ఎవరైనా నష్టపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధించేందుకు చట్టం తీసుకువస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బెట్టింగ్‌లు నిషేధించబడ్డాయి, కానీ ఇప్పుడు అంతా ఆన్‌లైన్‌లో జరుగుతోంది కాబట్టి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు.
ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని మోసాలు చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సజ్జనార్ సూచించారు. చైన్ సిస్టమ్, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్, ఓటీపీ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ వంటి మోసాల గురించి ఆయన గుర్తు చేశారు. ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా వీటిని అరికట్టవచ్చని అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో వేలాది బెట్టింగ్ యాప్‌లు అందుబాటులో ఉన్నాయని, వీటిని ప్రోత్సహించే యూట్యూబర్లను, ప్రచారకర్తలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. క్రికెటర్లు, సినీ స్టార్లు, టీవీ సీరియల్ నటులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు డబ్బు కోసం ఇలాంటి వాటిని ప్రోత్సహించకూడదని ఆయన అన్నారు. కష్టపడి పనిచేస్తేనే డబ్బు వస్తుందని, షార్ట్‌కట్ మార్గాల్లో
డబ్బును ఆశిస్తే నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే యూట్యూబర్లను బహిష్కరించాలని పిలుపునివ్వడంతో ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని సజ్జనార్ తెలిపారు. "సే నో టు బెట్టింగ్ యాప్స్" అనే ఉద్యమం ఊపందుకుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.
చివరగా, యువత బెట్టింగ్‌లకు బానిసలు కాకుండా ఉండాలంటే కష్టపడి పనిచేయాలనే ఆలోచనను ప్రోత్సహించాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని ఆయన సూచించారు. పిల్లలు డబ్బు కోసం ఎవరినైనా అడుగుతున్నారా, లోన్ యాప్‌లను ఉపయోగిస్తున్నారా అనేది గమనించాలని, వారిలో మార్పు కనిపిస్తే వెంటనే కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. రాబోయే రోజుల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తామని సజ్జనార్ తెలిపారు.

# తక్కువ ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రాలలో నాలుగో స్థానంలో ఏపీ

- మొదటి పేజీ తరువాయి
మంత్రులు వివరించారు.
జాతీయ సగటు 3.61% కంటే ఆంధ్రప్రదేశ్ ద్రవ్యోల్బణం రేటు 2.44% తక్కువగా ఉన్న విషయాన్ని వారు ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా తక్కువగా ద్రవ్యోల్బణం నమోదవుతున్న రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని వెల్లడించారు. వరుసగా 3 నెలలు జాతీయ సగటు కన్నా రాష్ట్ర ద్రవ్యోల్బణం తక్కువగా నమోదు అవుతోందని స్పష్టం చేశారు. ఇక, రాష్ట్రవ్యాప్తంగా 154 మండల కేంద్రాలు, 151 రైతు బజార్ల నుంచి ప్రతిరోజు సీపీ యాప్ ద్వారా ధరలను సేకరించి వాటిపై విశ్లేషణ చేస్తున్నట్లు అధికారులు మంత్రులకు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13 జిల్లాలకు ఉన్న ధర నివేదిక కేంద్రాలను 26 జిల్లాలకు పెంచేలా ఏప్రిల్ నుంచి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను ఎప్పటికప్పుడు సమీక్షించి, వాటిని నియంత్రించేందుకు
చర్యలు తీసుకోవాలని కమిటీ నిర్ణయం తీసుకుంది. వస్తు రవాణా చార్జీలలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు రవాణా శాఖ వారు తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. బియ్యం, కందిపప్పు, వంట నూనె, టమాటా, ఉల్లిపాయల ధరల స్థిరీకరణపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.
ధాన్యంపై మార్కెట్ రుసుము రెండు శాతం నుంచి ఒక శాతం తగ్గించేందుకు.... క్యాబినెట్ ఆమోదానికి నివేదిక తయారు చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. తృణధాన్యాల ఉత్పత్తి పెంచేందుకు, రైతులకు అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

# అప్పుడు జగన్ చేసిన తప్పే ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి
వైఎస్సార్ పేరు చెరిపి ప్రతీకారం తీర్చుకుంటోందని ఆరోపించారు. తద్వారా చంద్రబాబు ప్రభుత్వం కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాలను గాయపరిచిందని తెలిపారు.
"వైఎస్సార్ జిల్లాను తిరిగి వైఎస్సార్ కడప జిల్లా పేరుతో సవరించడంలో అభ్యంతరం లేకపోయినా... కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరును తీసెయ్యడాన్ని ఖండిస్తున్నాం. వైఎస్సార్ అంటే ఎందుకింత కక్ష అని అడుగుతున్నాం. వైఎస్సార్ జిల్లాలో తిరిగి కడప పేరు చేర్చినప్పుడు... విజయవాడ కేంద్రంగా ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు ఎన్టీఆర్ విజయవాడ అనో లేక పాత కృష్ణ జిల్లాకు ఎన్టీఆర్ కృష్ణా జిల్లాగా పేరు ఎందుకు మార్చలేదు? అని ప్రశ్నిస్తున్నాం. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి.
దేశంలోనే సంక్షేమ పథకాలకు ఆద్యుడు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నేత. ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు లాంటి ప్రజాకర్షక పథకాలకు రూపశిల్పి మహానేత వైఎస్సార్. తెలుగు వారు తమ గుండెల్లో గుడి కట్టుకొని, ఇంట్లో దేవుడి ఫోటోల పక్కన వైఎస్సార్ ఫోటో పెట్టుకొని పూజిస్తున్న గొప్ప నేతకు రాజకీయాలు ఆపాదించడం సరైంది కాదు. ఇది ఆయనకు ఇచ్చే గౌరవం అంతకన్నా కాదు. వైఎస్సార్ అనే పేరు ప్రజల ఆస్తి. ఆయన ఏ ఒక్కరి సొత్తు కాదు. వైఎస్సార్ తెలుగు వారి సొత్తు" అని షర్మిల స్పష్టం చేశారు.

# యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు

- మొదటి పేజీ తరువాయి
మంది సభ్యులతో యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు (వైటీడీ) ఉంటుందని వెల్లడించారు. ఈ బోర్డు పదవీ కాలాన్ని రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు చైర్మన్, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని స్పష్టం చేశారు.
వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారా జరుగుతుందని మంత్రి తెలిపారు. ఐఏఎస్ అధికారి ఈవోగా ఉంటారని వెల్లడించారు. వైటీడీ బోర్డు విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చని తెలిపారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద పాఠశాలలను స్థాపించుకోవచ్చని తెలిపారు.
గతంలో యాదగిరిగుట్ట భక్తులకు సరైన వసతులు లేవని ఆమె అన్నారు. కోట్లాది రూపాయలు
ఖర్చు చేసి ప్రభుత్వం వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. యాదగిరిగుట్టను మరింత మెరుగుపరిచేందుకే పాలక మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏటా రూ. 100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్ ప్రారంభం... చంద్రబాబు, పవన్ మధ్య సరదా క్షణాలు



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొని, సరదాగా గడిపారు.
అరకు కాఫీకి విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు చంద్రబాబు ప్రభుత్వం గట్టిగా కృషి చేస్తోంది. ఇప్పటికే పార్లమెంటులో అరకు కాఫీ కేఫ్ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. తాజాగా, ఏపీ అసెంబ్లీ ఆవరణలోనూ అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఇవాళ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు అసెంబ్లీలో అరకు కాఫీ స్టాల్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎం మధ్య సరదా క్షణాలు చోటుచేసుకున్నాయి. చంద్రబాబు స్వయంగా కాఫీ కప్ అందించగా... పవన్ చిరునవ్వుతో స్వీకరించారు. చంద్రబాబు తదితరులు ఈ స్టాల్ లో ఉంచిన పలు అరకు కాఫీ ఉత్పత్తులను కూడా ఆసక్తిగా పరిశీలించారు.

## ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మే 20న దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాల పిలుపు

- మొదటి పేజీ తరువాయి
పెన్షన్ రూ. 9,000 అందించడం సహా పలు డిమాండ్లు ఉన్నాయి.
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే విరాళాలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఏ పథకం కిందకు రానివారికి నెలకు రూ. 6,000 ఇవ్వాలని కూడా యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.
రెండు నెలల తర్వాత నిర్వహించే సమ్మె, భవిష్యత్తులో కార్మికులు, రైతుల దేశవ్యాప్త నిర్ణయాత్మక పోరాటాలకు నాంది పలుకుతుందని కార్మిక సంఘాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

## వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు..

**పెన్ పవర్ డెస్క్:** భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ 9 నెలల తర్వాత భూమికి తిరిగి వస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు సునీతా విలియమ్స్‌కు లేఖ రాశారు. మీరు భారతీయుల హృదయాల్లో నిలిచి ఉన్నారని పేర్కొన్నారు. సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ సుమారు తొమ్మిది నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉన్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున గం.3.27 నిమిషాలకు వారు భూమి పైకి చేరుకుంటారని అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ రాసిన లేఖను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా షేర్ చేశారు. మీరు వేల మైళ్ల దూరంలో ఉన్నప్పటికీ మా హృదయాలకు దగ్గరగానే ఉన్నారని పేర్కొన్నారు. భారత ప్రజలు మీరు ఆరోగ్యంగా ఉండాలని, ఈ మిషన్‌లో మీరు విజయం సాధించాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. మీరు తిరిగి వచ్చిన తర్వాత భారత్ లో పర్యటిస్తారని ఆశిస్తున్నాం అని మోదీ లేఖలో తెలిపారు.

## ప్రాజెక్టులపై తెలంగాణ పిటిషన్.. కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు

- మొదటి పేజీ తరువాయి
కౌంటర్లు దాఖలైన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని కూడా ఆదేశించింది. కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.తెలంగాణ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

## విజయవాడలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు ప్రారంభం

- మొదటి పేజీ తరువాయి
రాంప్రసాద్ రెడ్డి... శాప్ చైర్మన్ రవి నాయుడు సమన్వయంతో ఈ స్పోర్ట్స్ ఈవెంట్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రీడల పోటీల్లో పాల్గొనేందుకు 70 శాతం మంది ఎమ్మెల్యేలు తమ పేర్లను నమోదు చేయించుకున్నారని మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. ఇక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ సాయంత్రం ఢిల్లీ వెళుతుండడంతో, వారు రేపు గానీ, ఎల్లుండి గానీ ఈ క్రీడల పోటీలకు హాజరుకానున్నారు. సీఎం చంద్రబాబు విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు. కాగా, ఆటల పోటీల్లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, త్రోబాల్, టెన్నికాయిట్ క్రీడాంశాలతో పాటు అథ్లెటిక్స్ కూడా నిర్వహించనున్నారు. మొత్తం 13 రకాల క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. 175 మంది ఎమ్మెల్యేల్లో 140 మంది... 58 మంది ఎమ్మెల్సీల్లో 13 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారు.

## ముగిసిన పోసాని సీఐడీ విచారణ

ప్రముఖ నటుడు పోసాని కృష్ణమురళి సీఐడీ విచారణ పూర్తయింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయనను విచారించారు. విచారణ అనంతరం జైలుకు తరలించగా, సీఐడీ మరోసారి విచారణ కోసం కోర్టును ఆశ్రయించనుంది. పోసాని బెయిల్ పిటిషన్ విచారణ బుధవారానికి వాయిదా పడింది.ప్రముఖ సినీ నటుడు పోసాని కృష్ణమురళి సీఐడీ విచారణ ముగిసింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఈరోజు పోసానిని ఏపీ సీఐడీ అధికారులు విచారించారు. కోర్టు పోసానిని ఒక రోజు సీఐడీ కస్టడీకి ఇచ్చిన సంగతి తెలిసిందే. విచారణ ముగియడంతో ఆయనకు గుంటూరు జీజీహెచ్ లో వైద్య పరీక్షలు నిర్వహించి జిల్లా జైలుకు తరలించారు. దాదాపు నాలుగు గంటల సేపు విచారణ కొనసాగింది. అయితే, పోసానిని మరోసారి విచారించాలని సీఐడీ నిర్ణయించింది. దీనికోసం మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరనుంది. మరోవైపు పోసాని బెయిల్ పిటిషన్ పై విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. పీటీ వారెంట్ పై పోసానిని కర్నూలు నుంచి గుంటూరుకు తరలించిన సంగతి తెలిసిందే.

## ఉపరాష్ట్రపతి ని పరామర్శించిన ఎంపీ సానా సతీష్ బాబు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18** :ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం కోలుకున్న భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధనకర్ ను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మర్యాద పూర్వకంగా ఉపరాష్ట్రపతి చాంబర్ లో కలుసుకొని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.


# పెన్ పవర్

ఉభయ గోదావరి

కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు


# శ్రీ సత్యసాయి త్రాగునీరు యూనియన్ సమస్య

# పరిష్కారం దిశగా కలక్టర్ పి .ప్రశాంతి చొరవ





- సమ్మె విరమణ కు అంగీకరించిన ఉద్యోగులు

**సీతానగరం, పెన్ పవర్, మార్చి:18:**పురుషోత్తమ పట్నం శ్రీ సత్యసాయి త్రాగునీరు యూనియన్ ఉద్యోగుల సమస్య పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక నివేదిక సమర్పించడం జరిగిందని, మీ సమస్య పై పూర్తి అవగాహనా ఉందని తప్పనిసరి గా పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని,
ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఈ విషయమై సానుకూలంగా , వ్యక్తిగతంగా స్పందించినట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ పురుషోత్తపట్నం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కలక్టర్ సమావేశం నిర్వహించారు .
అనంతరం సాయంత్రం స్థానిక లాలా చెరువు జిల్లా ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద విలేఖరుల సమావేశంలో పురుషోత్తమ పట్నం శ్రీ సత్యసాయి త్రాగునీరు యూనియన్ ఉద్యోగ సంఘాల నాయకులు సమ్మె విరమణ ప్రకటన చెయ్యడం జరిగింది.
ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, మీ సమస్య పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి సానుకూలత వ్యక్తం కావడం, ఒక నెల జీత భత్యాల చెల్లింపు కు అవసరమైన రూ.10 లక్షలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా త్రాగునీరు సరఫరా విధానం ఎటువంటి ఆటంకం ప్రజలకి త్రాగునీరు సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని కలక్టర్ కోరారు. స్థానిక సంస్థలతో విలీనం చేయడం వల్ల నిధుల కేటాయింపు సాధ్యం అవుతుందని తెలిపారు. ఆమేరకు చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వము మీ విషయంలో సానుకూలంగా స్పందించిన దృష్ట్యా సమ్మె విరమణ చేయవలసినదిగా కలక్టర్ ప్రశాంతి కోరారు.ఉద్యోగ సంఘాల నాయకులు స్పందన.సమ్మె విరమణ పై ప్రకటన
శ్రీ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ పురుషోత్తపట్నం ఉద్యోగులు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి వారి సూచనలు మేరకు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మా సమస్య పట్ల సానుకూలంగా స్పందించి, బుధవారం అమరావతిలో చర్చ లకి పిలిచిన నేపధ్యంలో బేషరతుగా సమ్మె విరమించడం జరుగుతోందని సంఘా నాయలుకు అధ్యక్షులు కట్టమూరి వీరబాబు, జనరల్ సెక్రటరీ ఉందుర్తి ఇస్సాక్ లు తెలియ చేశారు.ఈ విషయమై ఆర్డబ్ల్యూఎస్ సూపరిండెంట్ ఇంజనీరు బీవిగిరి మరో దఫా దీక్ష శిబిరం వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించి, సమ్మె విరమణ చేయవలసినదిగా మీ సమస్య పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. బుధవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వద్ద సమావేశం లో సమస్య పరిష్కారం దిశగా వెళ్లనున్నట్లు తెలిపారు.



## తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

**ఆలమూరు,పెన్ పవర్, మార్చి 18:**
రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, వేసవిలో వచ్చే వ్యాధుల పట్ల వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు మండలపరిషత్ ప్రత్యేక అధికారి, ఐసిడిఎస్ పి.డి శాంతకుమారి అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాజు, సీడిపివో గజలక్ష్మి, ఆండబ్ల్యూస్ ఏఈ పద్మ, ఏవో లక్ష్మీలావణ్య, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో వివిధ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై, అంగన్వాడీల నిర్వహణ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని సూచించారు. మండలంలో 8500 ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తయిందని ఏవో ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పలువురు మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెవిన్యూ అంశాలపై ఆర్డీవో శ్రీకర్ సమీక్ష



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 18**
మండలంలో జరుగుతున్న వివిధ రెవిన్యూ పనులపై కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ మంగళవారం రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి ఆలమూరు తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జొన్నాడలో జరుగుతున్న రీసర్వేలో తప్పులు తలెత్తకుండా, రైతులకు సమస్యలు లేకుండా పూర్తిచేయాలని సూచించారు. అలాగే గతంలో ఇచ్చిన ఇంటిపట్టాల లబ్దిదారుల అంశంలో జరుగుతున్న క్షేత్రస్థాయి పరిశీలన త్వరగా పూర్తిచేయాలని, జీవో నెం 30ను అనుసరించి అభ్యంతరం లేని ఆక్రమణలు గుర్తించాలన్నారు. అనంతరం భూ రీ సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అసహనం వ్యక్తం చేశారు. తాసిల్దార్ కేజే ప్రకాష్ బాబు, డిప్యూటీ తాసిల్దార్ సుబ్బరాజు,వీర్వోలు, విలేజ్ సర్వేయర్లు, మండల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గుత్తుల వీరబ్రహ్మం మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలి



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 18:**మండలంలోని ఉద్యోగులందరికీ అండగా ఉంటూ, వారికి ఏ సమస్య వచ్చినా పరిష్కారం దిశగా ముందడుగు వేసే గుత్తుల వీరబ్రహ్మం మరిన్ని ఉన్నత శిఖరాలు అందుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు ఆలమూరు మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు బొంతు లోకేష్ అధ్యక్షతన ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అభినందన సభ, సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో వీరబ్రహ్మం చూపిన ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమన్నారు. కుల, మతాలకతీతంగా అందరితో ఆత్మీయంగా వ్యవహరించే వీరబ్రహ్మం సేవలు ప్రశంసనీయమన్నారు.అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులు వీరబ్రహ్మంను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు బి అప్పాజీ,ఎన్ రామచంద్రరావు, పి సుబ్బరాజు, నర్సాపురం డివైఈవో డి మురళి సత్యనారాయణ, ఎలక్ట్రికల్ ఏఈ దుర్గాప్రసాద్, పెదపళ్ళ పీహెచ్ సీ డాక్టర్ సాయి కిషోర్, ఆలమూరు మండల ఎలక్ట్రికల్ ,రెవెన్యూ, పంచాయతీరాజ్, మెడికల్ కోపరేటివ్ సొసైటీ, యుటిఎఫ్, ఎస్ టి యు,పి ఆర్ టి యు నాయకులు,ఉపాధ్యాయులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఆలమూరు, కపిలేశ్వరపురం, మండపేట, రావులపాలెం బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పిలుపుతో స్వచ్ఛతా సేవా

## కార్యక్రమాలు చేపట్టిన అరుంధతి యూత్



**గోపాలపురం,పెన్ పవర్ మార్చి 18:**మండలంలోని పలు గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులకు డయేరియా వ్యాధి సోకింది.విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి,ఎమ్మెల్యే వెంకట్రాజు,డిఎం అండ్ హెచ్ఓ వెంకటేశ్వరరావు,ఆర్డీవో సుస్మిత రాణి తదితరులు పలు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.అయితే ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడపడితే అక్కడ చెత్త చెదారం వేయకూడదని తమ పరిసరాలను తామే పరిశుభ్రం చేసుకోవాలని అన్నారు.అయితే మండలంలోని దొండపూడి గ్రామానికి చెందిన అరుంధతి యూత్ సభ్యులు స్పందించి ఎమ్మెల్యే పిలుపుమేరకు గ్రామంలో స్వచ్ఛతా సేవా కార్యక్రమాలను చేపట్టడం మొదలుపెట్టారు.రహదారుల శుభ్రం చేయడం,మురికి నీటి కాలువల పూడికతీత,చెత్త చెదారం తొలగింపు వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.సంఘ సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తున్నారు.

## గంధం బోసు పై దాడి



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, మార్చి 18** :జీలుగుమిల్లి మండలం తాటి యాకులగూడెం గ్రామానికి చెందిన గంధం బోసు పై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో గంధం బోసు తీవ్ర గాయాలు పాలై ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మంగళవారం సంఘటన స్థలానికి పోలీసులు క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ తో విచారణ చేపట్టారు .ఈ విచారణలో జీలుగుమిల్లి, పోలవరం సిఐలు బి వెంకటేశ్వరరావు, పి.బాల సురేష్ బాబు జీలుగుమిల్లి, కొయ్యలగూడెం ఎస్ఐలు పి నవీన్ కుమార్, చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాతా శిశు రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞానంద జి మహారాజ్





**గంగవరం/ కోరుకొండ, పెన్ పవర్, మార్చి 18** :మాతా శిశు సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞానందాజీ మహారాజ్ అన్నారు. మంగళవారం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో కోరుకొండ ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్ఫోసిస్ వారి ఆర్థిక సహాయం తో మాత శిశు సంరక్షణ పథకం ద్వారా గర్భిణులకు ,బాలింతలకు, 0.3సంవత్సరాలు పిల్లలకు 173 పౌష్టికాహారా కిట్లును, మందులను రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయనంద జీ మహారాజ్ పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు .అలాగే మాతా శిశు రక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ డిస్పెనరీ ఇన్చార్జి, స్వామి రఘువీరానంద జీ మహారాజ్ , మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ కె శ్రీనివాస్,
పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్ఞాన్ సుందర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వాలంటీర్లు, ప్రసాద్ భగీరథ రాజు,శ్రీనివాస్, భవాని, సుబ్బలక్ష్మి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

# జగ్గంపేట డొక్కా సీతమ్మ క్యాంటీన్ లో అన్నదానం

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** జగ్గంపేట పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం జనసేన పార్టీ ఇంచార్జ్ మరియు సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ లో అన్నదానం చేశారు. ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం నిర్వహిస్తున్నామని జనసేన నాయకులు పేర్కొన్నారు. పేదలు, ఇతర ప్రాంతాల నుంచి జగ్గంపేట పని మీద వచ్చే వారు ఇక్కడ అన్నం స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో కురుమల్ల నాగేశ్వరరావు, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, గంధం ప్రభాకర్, కాకిలేటి బాబ్జి, పాఠంశెట్టి రమేష్, సత్తి సోమరాజు, గోన శివ, కనకరాజు, అడబాల వీరబాబు, రాంరెడ్డి ఇతరులు పాల్గొన్నారు.



## చైర్ పర్సన్ రాణి అధికారం చేపట్టి నాలుగేళ్లు.



**మండపేట. పెన్ పవర్. మార్చి 18:**మండపేట మునిసిపల్ చరిత్ర లో వైసిపి అధికారం చేపట్టిన చైర్ పర్సన్ గా పతివాడ నూక దుర్గా రాణి నిలుస్తారు. ఆమె చైర్ పర్సన్ గా భాద్యతలు చేపట్టక ముందు సాధారణ గృహిణి. మండపేట చైర్ పర్సన్ సీటు బీసీ మహిళా కు రిజర్వ్ కావడం తో అప్పటి డిప్యూటీ సి ఏం పిల్లి సుభాష్ చంద్రబోస్ వ్యాపారవేత్త కొమ్ము రాంబాబు కు అవకాశం ఇస్తున్నట్లు ప్రకటించారు . దీంతో రాంబాబు తన సోదరుడు, వ్యాపార భాగస్వామిపతివాడ రమణ సతీమణి రాణి పేరు తెరపైకి తెచ్చారు. మంగళవారం నాటికి ఆమె చైర్ పర్సన్ గా పదవి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆమె ను కలిసి అభినందనలు తెలిపారు. ప్రస్తుతం కౌన్సిల్ లో టిడిపి పక్ష కౌన్సిలర్ ల మెజార్టీ వుంది. కాగా వైసిపి కి చెందిన చైర్ పర్సన్ అధికారం లో కొనసాగుతున్నారు. కరోనా కు ముందు 2020 లో మునిసిపల్ ఎన్నికలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో చైర్ పర్సన్ అభ్యర్థి గా రాణి ప్రచారం చేపట్టారు. ఇంతలో కరోనా వలన ఎన్నికలు వాయిదా పడ్డాయి. కాగా ఆ విపత్కర పరిస్థితి లో సైతం చైర్ పర్సన్ రాణి వార్డుల్లో విస్తృతం గా పర్యటించి బాధితులకు సాయం అందజేశారు. ఈ క్రమంలో 2021 లో పుర ఎన్నికలు జరిగాయి. ఫలితాల్లో మండపేట లో వైసిపి అంచనాలకు మించి సీట్లు సాధించింది. కౌన్సిల్ లో వైసిపి మెజార్టీ స్థానాలు దక్కించుకుంది. 20 వ వార్డు గొల్ల పుంత కాలని నుండి పోటీ చేసిన చైర్ పర్సన్ రాణి గెలిచి చైర్ పర్సన్ గా భాద్యతలు చేపట్టారు. 2021 మార్చి 18 న మండపేట చైర్ పర్సన్ గా పదవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భం గా పలువురు ఆమె కు శు భాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు





**సీతానగరం, పెన్ పవర్, మార్చి:18:**సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. ఏ. వి. కె.చైతన్య ఆధ్వర్యంలోకాటవరం గ్రామం లో మంగళవారం నాడు ఎంపీయుపి స్కూల్ నందుజాతీయ అయోడిన్ లోప కారక వ్యాధుల నియంత్రణా కార్యక్రమంఎన్ ఐ డి డి సి పిశాంపిల్ సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డా. ఏవీకే చైతన్య మాట్లాడుతూ ఎన్ ఐ డి డి సిపి శాంపిల్ సర్వే కార్యక్రమం మండలంలో కాటవరం స్కూల్ ని తీసుకొని అందులో 1వ తరగతి నుండి 6 వ తరగతి వరకు ఉన్న 90 మంది పిల్లలను అయోడిన్ లోపం వల్ల వచ్చేగాయిటర్,బుద్ధిమాంద్యం,శారీరక ఎదుగుదల లోపంవంటి లక్షణాలు ఏమైనా ఉన్నాయా అని పరీక్షించడం జరిగిందనీ ఇందులో 4గురు పిల్లలకి స్వల్పంగా గాయిటర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు గుర్తించిడం జరిగిందని చెప్పారు.పిల్లల గృహాలలో అయోడిన్ ఉప్పు వాడక నిర్ధారణ కోసం పిల్లల మూత్రశాంపిల్ లు, వారి ఇంటిలో వాడుతున్న ఉప్పు శాంపిల్ లు సేకరించి జిల్లా వైద్యారోగ్య శాఖాదికారి కార్యాలయానికి పంపించడం జరిగిందని ప్రతి ఒక్కరు అయో డైజ్డ్ ఉప్పు మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఓ వై.ఎస్ .రాయుడు,ప్రధానోపాధ్యయురాలు టి. వెంకటలక్ష్మీ ఎమ్మెల్యే హెచ్ పి ఎస్.కె. చాంద్ భీ, ఏఎన్ఎం ఆర్. జ్యోతి,ఆశాకార్యకర్త టి.సంధ్యాలత పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక సాయం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బిసి గృహాల లబ్దిదారులకు అదనపు ఆర్ధిక సహాయం అందజేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని కాకినాడ జిల్లా హౌసింగ్ పీడీ ఎన్.వి.వి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం హౌసింగ్ పీడీ తన సిబ్బందితో జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గృహాలను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటికే గృహాల నిర్మాణంలో ఉన్న వారికి అదనంగా నిధులు మంజూరు అయినట్లు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆర్థిక సహాయంపై జిఓ జారీ చేయడం జరిగిందన్నారు. ఎస్సీ, బిసి లబ్దిదారులకు రూ.50వేలు, ఎస్టి లబ్దిదారులకు రూ. 75వేలు, ఎస్టీలలో అట్టడుగున జీవిస్తున్న (పివిటిజి) వారికి రూ.లక్ష అదనపు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే అందిస్తున్న రూ.1.8 లక్షల యూనిట్ వ్యయానికి అదనంగా ఈ అదనపు ఆర్థిక సహాయం గృహ నిర్మాణ లబ్దిదారులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఈ వేణుగోపాలస్వామి, జగ్గంపేట హౌసింగ్ ఏఈ టి.శేఖర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీని నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** జగ్గంపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జగ్గంపేట టౌన్ హాల్ ఆవరణలో జరిగింది. జగ్గంపేట నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథి గా బీజేపీ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజవర్గంలోని నాలుగు మండలాల్లో బూత్ కమిటీలు నూటికి నూరు శాతం పూర్తి చేయాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని మరింత బలోపేతం చేసి అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. గ్రామ, మండల కమిటీలు వేసి పూర్తి చేసుకోవాలని అన్నారు. పార్టీ ప్రతిష్ట కోసం ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా పనిచేయాలని బిజెపి క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజి కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు (నాని), డివిఎన్ రాజు, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, చోడిశెట్టి రమేష్ బాబు, జగ్గంపేట అసెంబ్లీ కో కన్వీనర్ కోన వెంకట సురేష్, జగ్గంపేట మండల అధ్యక్షుడు పల్లా రాము, గండేపల్లి మండల అధ్యక్షుడు తోరాటి వెంకన్న, గోకవరం మండల అధ్యక్షుడు ఇనకోటి బాపన్న దొర తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శకంగా ఓటర్ల జాబితా నిర్వహించాలి



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** జగ్గంపేట నియోజకవర్గ ఓటర్ల జాబితా సంక్లిష్ట సవరణ 2025ను పారదర్శకంగా నిర్వహించడంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తోడ్పాటునందించాలని కాకినాడ జిల్లా హౌసింగ్ పీడీ, జగ్గంపేట నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్.వి.వి సత్యనారాయణ కోరారు. మంగళవారం జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్షాళన, భావితరం ఓటర్లను చేర్పించుట, మరణించిన ఓటర్లను గుర్తించుట, పోలింగ్ కేంద్రాల మార్పులు, ఓటర్ల పేరులు సవరణలు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్ల జాబితా సవరణను చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జగ్గంపేట తహసిల్దార్ జేవియర్ రమేష్, గండేపల్లి తహసిల్దార్ శ్రీనివాస్, కిర్లంపూడి తహసిల్దార్ చిరంజీవి, గోకవరం తహసిల్దార్ ఎం.సాయి ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** స్థానిక రావులమ్మనగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అందజేశారు. గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన గంగిరెడ్ల హరికృష్ణకు రూ.43,603, కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన గుద్దాటి చక్రమ్మకు 36250 రూపాయలు వారి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందించడం జరిగిందని నవీన్ తెలిపారు. అలాగే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటకు చెందిన పొన్నాడ చంద్రకళ, దుర్గాప్రసాద్ దంపతులకు, జగ్గంపేట గ్రామానికి చెందిన మణిపావని శివరామకృష్ణ దంపతులకు రూ.20 వేలు చొప్పున రెండు జంటలకు నవీన్ పెళ్లి కానుక చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, చదరం చంటిబాబు, రేఖ బుల్లి రాజు, కుంచే రామకృష్ణ, పాఠం శెట్టి రవి, బోదిరెడ్ల సుబ్బారావు, నంది బాలకృష్ణ, కరణం బోరయ్య, బొడ్డేటి సుమన్, నాండ్ల చిరంజీవి, మేడిశెట్టి నారాయణరావు, గద్దె మారుతి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడికి ఆర్థిక సాయం



**కొత్తపేట, పెన్ పవర్,మార్చి18:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ,గోదావరి క్రేన్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ముక్కామల గ్రామానికి చెందిన క్రేన్ ఆపరేటర్ ముక్కామల శ్రీను గతంలో రోడ్డు ప్రమాదం జరిగి తీవ్ర గాయాలు పాలైనారు. వైద్య పరంగా అతను ఆర్థికంగా సమస్యలతో ఇబ్బంది పడుతూ ఇంటి దగ్గరే విశ్రాంతి తీసుకుం టున్నారు,నలుగురు సభ్యులతో ఉన్న కుటుంబ పోషణ భారంగా మారింది. అతని ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా మారాడంతో ఇది తెలుసుకున్న గోదావరి క్రేన్ ఆపరేటర్స్ ,ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీనుకి ధైర్యం చెప్పి 10వేల ఆర్థిక సాయం ,నిత్యావసర సరుకులు అందించి ఉదారతను చాటారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బొంతు గణేష్ కుమార్,సెక్రెటరీ సుబ్బారావు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ మరియు ఇతర జిల్లాల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఉద్యోగ మేళాలో వరుణ్ మోటార్స్, ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్, డైకిన్, ఎల్ జి ఎలక్ట్రానిక్స్, బజాజ్ ఫైనాన్స్, మేడ్ ప్లస్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొని, వివిధ రంగాలలో ఉద్యోగ అవకాశాలను అందించాయి. ఈ జాబ్ డ్రైవ్ ను కళాశాల స్కిల్ హబ్ కో ఆర్డినటర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించగా మొత్తం 63 మంది విద్యార్థులు పాల్గొని ఇంటర్వ్యూలు, నైపుణ్య అంచనా పరీక్షలు మరియు కెరీర్ కౌన్సెలింగ్ సెషన్లలో పాల్గొన్నారు. వీరిలో 28 మంది విద్యార్థులు తాత్కాలిక నియామక పత్రాలను పొందారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మేనేజర్ ఎమ్.కొండలరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులను ఉద్యోగానికి సిద్ధం చేసే నైపుణ్యాలను అందించడంలో కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. ఇది వారి భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మరియు ఉద్యోగ అవకాశాలను కల్పించిన సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సి ఎస్ ఈ విభాగంలో కె.బ్యూలా కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు

**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :**నిపుణుల బృందం సిఫార్సు మేరకు కె. బ్యూలా సిద్ధాంత వ్యాసం 'ఏన్ ఇండస్ట్రియల్ గ్యాస్ లీకేజ్ డిటెక్షన్ ఇన్ అండ్ అరౌండ్ విశాఖపట్నం ఇండియా యూజింగ్ మెషిన్ లెర్నింగ్ అండ్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అప్రోచెస్' జేఎన్టీయూకే అధికారులచే ఆమోదముద్ర పొందింది. ఈమెకు పిహెచ్డి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ సి ఎస్ ఈ విభాగంలో లభించింది. కే. బ్యూలా తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని పైడా కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సిఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి వంశీకృష్ణ రాజా, విశాఖపట్నంలోని గాయత్రీ విద్యా పరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సిఎస్ఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పి కృష్ణ సుబ్బారావుల ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.



# ర్యాలి గ్రామంలో పర్యటించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు అడబాల






**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 18:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండల బిజెపి మండల యు. వెంకటేశ్వరరావు స్వగ్రామమైన ర్యాలి లో మంగళవారం జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ శాసనసభ్యులు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిని మండల అధ్యక్షులు యు .వెంకటేశ్వరరావు, మండల నాయకులు, కార్యకర్తలు దుస్సాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ సూచనలతో, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాలతో జిల్లాలో నూతనంగా మండల అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన వారి గృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేసి, పార్టీ కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి సంబంధించి దిశానిర్దేశం చేస్తున్నామని, అందులో భాగంగా మంగళ వారం ఆత్రేయపురం మండలంలో నూతన అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్న యు . వెంకటేశ్వరరావు గృహానికి ర్యాలి గ్రామం విచ్చేసామని తెలిపారు. మండలంలోని 17 గ్రామాలలో ప్రతి బూత్ నందు బిజెపి జెండా రెపరెపలాడాలని, బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా కలిసి ముందుకు సాగాలని ఆయన కోరారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామాలలో ప్రజలకు వివరించాలని తెలిపారు.

అనంతరం శ్రీ జగన్మోహిని కేశవ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వేద పండితులు అవధాని వేద ఆశీర్వచనం చేయగా ఆలయ కార్య నిర్వహణ అధికారి భాగవతుల వెంకట రమణమూర్తి స్వామివారి చిత్రపటం చరిత్ర కలిగిన పుస్తకం శేష వస్త్రంతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చీకురుమెల్లి శ్రీనివాసరావు, కొత్తపేట నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబుగౌడ,మండల ప్రధాన కార్యదర్శి తాడాల సుబ్రమణ్యం (పండు), రాష్ట్ర కిసాన్ మోర్చసభ్యులు చేకూరి రమేష్ వర్మ, ఓబీసీమోర్చా కార్యవర్గ సభ్యులు గూడవెల్లి రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు వానపల్లి శేషగిరిరావు, బూత్ కమిటీ అధ్యక్షులు నరుకుల వీరభద్రం, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కాంప్లెక్స్ లో జేఎన్టీయూకే ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛభారత్.




**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** జెఎన్టియుకె ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలోని ఆర్టిసి బస్ స్టేషన్ నందు భారీ పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.జి. శ్యామ కుమార్ అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముందుగా యూనివర్శిటీ మెయిన్ గేట్ వద్ద ఇన్ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ.వి. రవీంద్రనాథ్ ప్రారంభించగా యుసిఇకె ఇన్ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొ. ఎన్. మోహన్రావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. జివిఎస్ఆర్. దీక్షితులు, ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టరేట్ నుంచి సంజయ్ కుమార్ లు విచ్చేశారు.ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా. జి.శ్యామ కుమార్ మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు %ు% క్రీడల మంత్రిత్వ శాఖ మరియు హైదరాబాద్లోని ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ మార్గదర్శకాల ప్రకారం ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ ఎం. రామకృష్ణ సహకారంతో కాకినాడలోని ఆర్టిసి బస్ స్టేషన్ వద్ద భారీ పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 200మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిశుభ్రతా కార్యక్రమంలో పాల్గొని చెత్తను సేకరించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జెఎన్టియుకె, యుసిఇకె ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ప్రోగ్రాం ఆఫీసర్లు కె.రమణాజీ, ఎంవిఎస్వి. కిరణ్మయి, డా.పి. వీరలక్ష్మి, బోధనేతర సిబ్బంది, జెఎన్టియుకె మరియు అనుబంధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, కాకినాడ ఆర్టిసి డిపో మేనేజర్ ధర్మారావు, ఆర్ టిసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టైగర్ ట్రియంఫ్-25 సైనిక విన్యాసాల కొరకు అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** కాకినాడ తీరంలోని నేవల్ ఎన్ క్లేవ్ లో వచ్చే ఏప్రియల్ 8 నుండి 13వ తేదీ వరకూ భారత్, అమెరికా వాయుసేనా దళాలు ఉమ్మడిగా నిర్వహించనున్న టైగర్ ట్రియంఫ్-25 సైనిక విన్యాసాల కొరకు అవసరమైన సివిల్ సహకారాన్ని అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులను కోరారు.మంగళవారం మధ్యాహ్నం జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు అధ్యక్షతన ఆయన ఛాంబరులో ఏప్రియల్ 8 నుండి 13 వరకూ కాకినాడ తీరంలో సైనిక విన్యాసాల నిర్వహణపై సైనిక, సివిల్ అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సివిల్-మిలటరీ లైజాన్ అధికారి కమాండర్ వై.కె.కిషోర్ మాట్లాడుతూ భారత్, అమెరికా వాయుసేనల సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రియల్ 1 నుండి 13వ తేదీ వరకూ టైగర్ ట్రియంఫ్-25 పేరిట ఉమ్మడి సైనిక విన్యాసాలను విశాఖపట్నం, కాకినాడ తీరాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఏప్రియల్ 8 నుండి 13వ తేదీ వరకూ కాకినాడ తీరంలోని నేవల్ ఎన్ క్లేవ్ లో యాంఫీబియస్ విన్యాసాలు సముద్రంలోను, ఉపరితలంపైన జరుగుతాయని, ఈ కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖలు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ఈ మేరకు సైనికాధికారులు కోరిన అంశాలపై శాఖల వారిగా చేపట్టవలసిన చర్యలను డిఆర్ఓ వెంకట్రావు ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఏప్రియల్ 7వ తేదీ నాటికి విన్యాసాలు జరిగే కాంపింగ్ సైట్ లో చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేయించాలని, అలాగే విన్యాసాలు జరిగే వారం రోజులు పారిశుద్య నిర్వహణకు అవసరమైన సిబ్బంది, యంత్రాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్, పంచాయితీ అధికారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ నీటితో నింపిన రెండు ఫైర్ టెండర్లను, సిబ్బందిని వారం రోజులు అందుబాటులో ఉంచాలని కోరారు. విన్యాసాలు జరిగే ప్రాంతంలో స్టేట్ హైవే బ్లాకింగ్, బారికేడింగ్, ట్రాఫిక్ మళ్లింపు, క్రౌడ్ నియంత్రణ అంశాలను పోలీస్ శాఖ చేపట్టాలన్నారు. అలాగే సైనిక అధికారులు, సిబ్బంది, సామాగ్రిని విశాఖపట్నం, కాకినాడల మధ్య సంచరించే రూట్లలో రోడ్ కాన్వాయ్ ఆపరేషన్స్ కు అవసరమైన సహకారాన్ని సైనిక అధికారులకు అందించాలన్నారు. సైనిక విన్యాసాలు దృష్యా ప్రవేశ అనుమతి ఉండని నో పబ్లిక్ జోన్ ప్రాంతాల గురించి నేవల్ ఎన్ క్లేవ్ పరిసర గ్రామాల ప్రజలందరికీ సమాచారాన్ని పంచాయితీ కార్యదర్శుల ద్వారా తెలియజేయాలని డిపిఓ ను కోరారు. అలాగే సముద్రంలో విన్యాసాలు జరిగే ప్రాంతానికి సమీపంలోకి మత్స్యకారుల బోట్లు ప్రవేశించకుండా మత్స్య శాఖ, మెరైన్ పోలీస్ శాఖలు కట్టుదిట్టం చేయాలన్నారు. ప్రధమ చికిత్స అందించేందుకు కాకినాడలోని వివిధ ప్రయివేట్ ఆసుపత్రులనుండి అడ్వాన్సు లైఫ్ సపోర్టింగ్ సిస్టమ్స్ కలిగిన ఆంబులెన్స్ లను వారం రోజులు అందుబాటులో ఉంచాలని డిఎంహెచ్ఓ ను కోరారు. 11వ తేదీన ఉన్నత సైనిక అధికారులు విన్యాసాల సందర్శించనున్న 11వ తేదీన ఉదయం మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తారని, ఇందుకు అవసరమైన మీడియా సమన్వయం చేపట్టాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిని కోరారు. అంతర్జాతీయ సైనిక దళాల భాగస్వామ్యంతో భారత సైన్యం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టైగర్ ట్రియంఫ్-25 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వంతో సహకరించాలని డిఆర్ఓ వెంకట్రావు కోరారు.

ఈ సమావేశంలో సైనిక అధికారి టివివి ప్రసాద్, మైరైన్ పోలీస్ అధికారి రామ్మోహన్ రెడ్డి, రూరల్ సిఐ చైతన్య కృష్ణ, ఎంహెచ్ఓ డా.పృధ్వీ, మత్స్యశాఖ అధికారి అనూరాధ, కెఎస్పిఎల్, ఫైర్, మెడికల్ అండ్ హెల్త్, పంచాయితీ, ఇంటిలిజెన్స్, సమాచార శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల

పేద విద్యార్థుల చదువుకు భరోసా



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** కాకినాడ నగరం 27వ డివిజన్ కి చెందిన కాళ్ళ సాయి మంగాదేవి ఎమ్మెస్సీ,ఎంబీఏ ,గంగాధర్ తేజ శ్రీ ఇద్దరూ కూడా ఒకరు గ్రాడ్యుయేట్ ఇంకొకరు ఇంకా విద్యను కొనసాగిస్తున్నారు.వీరు ఇద్దరూ కూడా పేద కుటుంబానికి చెందిన వారు అయినా ఐ ఏ ఎస్ అవ్వాలనే సంకల్పంతో ఉన్నారు. వీరి పట్టుదలను చూసి ఉభయ గోదావరి ఎమ్మెల్సీ ఎలక్షన్ ముందు,పేరాబత్తుల రాజశేఖరం, ఎలక్షన్ అనంతరం వీరి విద్య నైపుణ్యం పెంచుటకు భవిష్యత్తులో వీరికీ ఎటువంటి సహాయం అందించాలో స్వయంగా వచ్చి తెలుసుకుంటాను అని మాట ఇవ్వడం జరిగింది.ఆ మాట ప్రకారం కాకినాడ నగరంలో స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు తనయుడు అయిన వనమాడి మోహన్ వర్మ ని వెంట పెట్టుకుని తేజ శ్రీ , కాళ్ళ సాయి మంగాదేవి ఇంటికి వెళ్లి వారి పెద్దలతో మాట్లాడి వారికి భరోసా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి సభ్యులు పాల్గొన్నారు.

# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలి



- 3వ సెషన్స్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ పి.కమలా దేవి



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలని 3వ సెషన్స్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ పి.కమలా దేవి ఆదేశించారు.ఆమె ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రొప్రియెట్ అథారిటీ, డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ జిల్లా స్థాయి పీసీ, పీఎన్డటీ సమన్వయ కమిటీ సమావేశం వివేకానంద సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన 158 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ నెల నుండి ఫిబ్రవరి నెల వరకు 40 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 347 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. అదేవిదంగా 2 కొత్తగా నమోదు చేసుకున్న స్కాన్ సెంటర్, 4 రెన్యూవల్ 14 స్కాన్ సెంటర్ల మిషన్ మార్పు, డాక్టర్ మార్పు వాటికి కమిటి ఆమోదం తెలిపినది.పి.కమలా దేవి, 3వ సెషన్స్ ఆడిషినల్ డిస్ట్రిక్ట్ జడ్జ్, కాకినాడ ముఖ్య అతిదిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి బేర్ యాక్ట్ పుస్తకాలను ఆవిష్కరణ చేస్తూ అందరూ రేడియాలజీస్ట్, గైనకలాజిస్ట్ స్కాన్ సెంటర్ ఓనర్లు తప్పనిసరిగా పి.సి.పి.ఎన్.డి.టి. చట్టం యొక్క నియమ నిబంధనలు, తప్పనిసరిగా పాటించాలని సూచించారు. స్కాన్ సెంటర్ నందు రిజిస్టర్లు, ఫారం 'ఎఫ్', కన్సెంట్ ఫారం వంటివి తప్పనిసరిగా మెయిన్ టైన్ చెయ్యాలని సూచించారు.డిఆర్వో జె. వెంకట రావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు స్కాన్ సెంటర్ వారు చట్టాన్ని సక్రమంగా అమలు చేసే దిశగా పనిచెయ్యాలని తెలియజేసారు. డాక్టర్, జె. నరసింహ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, మాట్లాడుతూ కాకినాడ జి.జి.హెచ్. ఫోరెన్సిక్ హెచ్.ఒ.డి. డా. పి. ఉమా మహేశ్వరరావు పి.పి.టి. ద్వారా పి.సి,పి.ఎన్.డిటి యాక్ట్ సంబందించిన విషయాలను తమ స్కాన్ సెంటర్ ఖచ్చితంగా అమలు చెయ్యాలని తెలియజేసారు. డీఐవో డా. కె.వి. సుబ్బరాజు, డా. పి. సరిత మాట్లాడుతూ అకస్మిక తనిఖీలు, డికాయ్ ఆపరేషన్ లు చట్ట ప్రకారం చేస్తున్నామని తెలియజేసారు.ఈ సమావేశంలో, ఎం.జె.వి. భాస్కర రావు, ఎ.ఎస్.పి., డి.ఎల్.ఎ.టి.ఒ డా. ఆర్. రమేష్. డీఐవో డా. కె.వి. సుబ్బ రాజు, డి.సి.హెచ్.ఎస్. డా. ఎస్. స్వప్న, డిప్యూటీ డి.ఎం. హెచ్.ఒ. డా.పి. సరిత, స్వచ్ఛంద సంస్థ ప్రతినిదులు కరణం వెంకటేశ్వరరావు, ఎస్. అప్పల నాయుడు, యల్లా పద్మలత,డి. నాగబాబు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పి.ఆర్.ఒ.ఎస్.అజయ్, జి.జి. హెచ్. నుండి వచ్చిన హెచ్.ఒ.డి.లు, రేడియాలజీ, పిడియాట్రిక్, గైనిక్, పీడాలజీ డిపార్టుమెంటు డా.కె.ఎస్.సునీత, డా. బి.రాంబాబు, డా. సి. హెచ్, మాధురి, డా. టి. శ్రీధర్,డా ఎస్. నందిశ్వర, ప్రభుత్వ , ప్రైవేటు రేడియాలజీ, గైనకాలజీ, డెమో సిబ్బంది పాల్గొన్నారు.

# మర్రిపాకలో పేకాట శిబిరంపై దాడి



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు జగ్గంపేట సీఐ వై ఆర్ కే శ్రీనివాస్ కు సమాచారం రావడంతో మంగళవారం జగ్గంపేట ఎస్సై టి.రఘునాథరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,450 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేశారు. ఎవరైనా జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వై ఆర్ కె, ఎస్ఐ రఘునాథరావు హెచ్చరించారు.

# జేసీని కలిసిన బిఎంఎస్ ప్రతినిధులు.



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** మంగళవారం ఉదయం భారతీయ మజ్దూర్ సంఘ ప్రతినిధులు తాళ్లూరి జగదీష్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను ఆయన చాంబర్లో కలిశారు. దేశవ్యాప్తంగా బి ఎం ఎస్ ప్రతినిధులు దేశ ప్రధానికి వినతి పత్రం సమర్పించే భాగంగా,ఈ సందర్భంగా జెసికి వినతిపత్రం సమర్పిస్తూ, ఈపీఎస్ 95 పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల విశ్రాంత ఉద్యోగులకు కార్మికులకు ఇచ్చే పెన్షన్ వెయ్యి రూపాయల నుండి 5000 రూపాయల వరకు పెంచమని కోరారు. దేశవ్యాప్తంగా ఇటువంటి వారు సుమారు 78 లక్షల మంది ఉన్నారని వారికి పెన్షన్ పెంచడంతో పాటుగా డి ఏ కూడా ఇవ్వాలని, ఆయుష్మాన్ భారత్ పథకం ఆరోగ్య కార్డులు అందించే విధముగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ, జిల్లా కలెక్టర్ ద్వారా దేశ ప్రధానికి వినతి పత్రం పంపించారు. ఈ కార్యక్రమంలో బి ఎం ఎస్ ప్రతినిధులు పి ఆర్ వి రావు, బి అప్పారావు, పి వీరాంజనేయరావు, ప్రవీణ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ అన్న మాటే మాకు శాసనం

- ఆయన ఆదేశిస్తే దేనికైనా మేము సిద్ధం
- మావులూరి సురేష్ నాయుడు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :** పవనన్న మాటే మాకు శాసనం అని ఆయన ఆదేశిస్తే ఏ పని చేయడానికి అయినా తమ సిద్ధమని ఆయన అభిమానులుగా పార్టీ సైనికులుగా పనిచేసే ఆయనను గెలిపించుకున్నామని డిప్యూటీ సీఎం హోదాలో ఆయనను చూసుకుంటున్నామని జనసేన పార్టీ నాయకులు సురేష్ అన్నారు. ఆయన ఆదేశం ప్రకారమే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా స్వచ్ఛ మైదాన్ కమిటీ సభ్యునిగా ఉంటూ వరుసగా 4వ రోజు స్వచ్ఛ మైదాన్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని నేటితో సభాస్థలి పరిశుభ్రతా పనులు పూర్తిచేసామని అన్నారు.తమతో పాటు అనేకమంది జనసైనికులువీరమహిళలు కాకినాడ నుండీ వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించారని అన్నారు.జనసైనికులు వీరమహిళలు ఇకముందు జనసేవకులుగా మారి ప్రజా సేవలో పవనన్న ఆదేశాలమేరకు పనిచేయడానికి సిద్ధంగా ఉంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో మోసా యోసేపు, పెంకే జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలో మండలం బిజెపి కార్యవర్గ సమావేశం.





**-నూతన మండల శాఖ అధ్యక్షుడు ఎన్నికపై అభిప్రాయ సేకరణ.**

**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 18:** మండల కేంద్రమైన కిర్లంపూడిలో భారతీయ జనతా పార్టీ కిర్లంపూడి మండలం కార్యవర్గ సమావేశం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక విజ్ఞాన భారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్ లో మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మండల బిజెపి అధ్యక్షుడు ఎన్నికపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు.సదర్ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు నియోజవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ,జిల్లా ప్రధాన కార్యదర్శిలు దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, మట్ట మంగరాజు, కామినేని జయశ్రీ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కంట కాశీ విశ్వనాథం, దొడ్డా అప్పారావు, శరకణం రాజబాబు,కోనేటి శ్రీనివాస్, బాలిన వెంకటేశ్వరరావు,బొడ్డేటి సత్య నారాయణ, ఐ. వి.వి సత్యనారాయణ, ఏనుగుపల్లి జలబాబు,మత్స వెంకటరమణ, గోడి లక్ష్మి, భువనగిరి కాశి విశ్వనాథం, అల్లు శివరామకృష్ణ, ఆడారి రామచంద్ర, భూమనాదుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన కనీస కర్తవ్యం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 18:** జగ్గంపేట వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్, మాజీ డిస్టిక్ గవర్నర్ కొత్త కొండ బాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.సురేష్, వెత్సా నాగసత్య, సెక్రెటరీ మానేపల్లి సతీష్, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కొత్త కొండబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన కనీస కర్తవ్యం అన్నారు. భావితరాలకి మనం మంచి వాతావరణం అందించేలాగా అందరూ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని పేర్కొన్నారు.

## అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు



**గోకవరం/కోరుకొండ పెన్ పవర్ మార్చి 18 :**
నార్త్ జోన్ డిఎస్పి వై శ్రీకాంత్ నార్త్ జోన్ స్పెషల్ టీం తో కలిసి మంగళవారం కోరుకొండ బస్టాండు ఎదురుగా ఉన్న కిళ్ళీ షాపునందు తనిఖీ చేయగా కోడినాగుల రాజబాబు అనే వ్యక్తి సుమారు 4,400 విలువగల మద్యం అమ్ముతూ పట్టుబడ్డాడు . రాజబాబుపై కేసు నమోదు చేసి కోర్టునందు హాజరపరచగా 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు కోరుకొండ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ టి.శ్యాంసుందర్ తెలియజేశారు.

## కోడిపందాలపై పోలీసులు దాడి



**గోకవరం పెన్ పవర్ మార్చి 18 :** కోరుకొండ సిఐ సత్య కిషోర్ పర్యవేక్షణలో గోకవరం ఎస్సై విఎన్వి పవన్ కుమార్, కోరుకొండ ఎస్సై శ్యాంసుందర్ తమ సిబ్బందితో కలిసి గోకవరం మండలం ఇటికలపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందాలు పై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 7200 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాలు నిర్వాహకుడు కోడి కత్తులు కట్టే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోడి పందాలు పేకాట వంటి జూదాలను నిర్వహించినా వాటిని ప్రోత్సహించిన వారిపైన కేసులు నమోదు చేసి చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామనిపోలీసులు హెచ్చరించారు.

# మండలంలో జ్యోతుల రామస్వామి విస్తృత పర్యటన

**అపూర్వ స్వాగతం పలికిన వైసీపీ శ్రేణులు**



**గోకవరం, పెన్ పవర్ మార్చి18:** జగ్గంపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు జ్యోతుల చంటి బాబు తండ్రి జ్యోతుల రామస్వామి మంగళవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు.మండలంలోని గంగంపాలెం, ఠాగూర్ పాలెం, తిరుమలాయపాలెం, రంప ఎర్రంపాలెం ,పెంటపల్లి, బావాజీ పేట, వెదురుపాక, గుమ్మల దొడ్డి, అచ్యుతాపురం గ్రామాలలో పర్యటించిన జ్యోతుల రామస్వామికి వైసిపి పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జ్యోతుల రామస్వామి మాట్లాడుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నానని పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తలలో ధైర్యం నింపి రానున్న రోజుల్లో ఉద్యమస్ఫూర్తితో ముందుకు కదిలేలా కార్యచరణతో పనిచేయడానికి పార్టీ శ్రేణులలో ఉత్తేజం నింపడానికి పర్యటిస్తున్నాని చెప్పారు.పార్టీ దురదృష్టవశాత్తు పరాజయం పాలైనా పార్టీ శ్రేణుల్లో ఏమాత్రం హుషారు తగ్గలేదని కార్యకర్తలను చూస్తుంటే ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని అనిపిస్తుందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తీసుకొచ్చి జగన్మోహన్ రెడ్డి గారిని మళ్లీ ముఖ్యమంత్రి గా చేసుకునే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరం కంకణబద్ధులై పనిచేద్దాం అని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు యోగక్షేమాలు తెలుసుకున్న జ్యోతుల రామస్వామి మీకు ఏ కష్టం వచ్చినా జ్యోతుల చంటిబాబు,నేను నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

రానున్న కొద్ది రోజుల్లో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తలతో భారీ సమావేశం ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ఉందని తెలిపారు. కార్యక్రమాల్లో భారీ స్థాయిలో ఆయా గ్రామాల నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొనడంతో పండుగ వాతావరణం సంతరించుకుంది.

# ఉద్యానవన పంటల ద్వారా ఆర్థిక అభివృద్ధి-ఎంపీపీ కృష్ణారెడ్డి



**గంగవరం, పెన్ పవర్, మార్చి 18:** గిరిజన రైతులు జీడి మామిడి వంటి ఉద్యానవన పంటలు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, ఐటీడీఏ ద్వారా అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి అన్నారు గంగవరం సచివాలయంలో హార్టికల్చర్ పి హెచ్ ఓ చిట్టిబాబు ఆధ్వర్యంలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై మంజూరైన స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు ఉద్యాన పంటలు గిరిజన రైతులు ఐటీడీఏ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గంగవరం మండలంలో 50 మందికి సబ్సిడీపై మంజూరు చేసిన స్ప్రేయర్లను పంపిణీ చేశారు. 20వేల రూపాయలు విలువగల స్ప్రేయర్ గిరిజన రైతులకు 1734 రూపాయలకే అందించడం జరిగిందన్నారు. వైస్ ఎంపీపీ కే గంగాదేవి మాట్లాడుతూ గిరిజన రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం మంజూరు చేస్తున్న సద్వినియోగం చేసుకోవాలన్నారు ఎంపీఈవో పి స్వర్ణలత మాట్లాడుతూ లబ్ధిదారుని వాటా 1734 రూపాయలు కాగా ఐటిడిఏ సబ్సిడీ 7606 రూపాయలు ఎంఐడిహెచ్ వారి సబ్సిడీ8000 రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీలకు చెందిన రైతులకు ఈ సబ్సిడీ స్ప్రేయర్లు మంజూరు చేసినట్లు వివరించారు. గంగవరం సర్పంచ్ కలుముల అక్కమ్మ , వైస్ ఎంపీపీ కే గంగాదేవి ,మాజీ ఎంపీటీసీ కే. బుల్లియమ్మ, గంగవరం ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు, సచివాలయ పట్టు పరిశ్రమ సహాయకురాలు రెహనా రైతులు పాల్గొన్నారు.

# బాపన్న దొర ఆధ్వర్యంలో నియోజకవర్గం సమావేశానికి తరలివెళ్లిన బిజెపి శ్రేణులు



**గోకవరం మార్చి,18:** జగ్గంపేటలో భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోకవరం మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సమావేశానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గోకవరం మండలంలో బీజేపీ పార్టీ బలోపేతానికి చేస్తున్న కార్యక్రమాలు, కమిటీలు, పలు అంశాలు గురించి ఇనకోటి బాపన్న దొర జిల్లా అధ్యక్షులు విశ్వేశ్వర రావుకి వివరించారు. అనంతరం పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు బుక్లెట్లలను ఆయనకు అందజేశారు. మండలంలో వందశాతం బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా బిక్కిన విశ్వేశ్వరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట మంగరాజు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు సత్తి వెంకటరెడ్డి, నాయకులు దాసరి ధర్మరాజు, నియోజకవర్గ కో- కన్వీనర్ కోన సురేష్, రైల్వే బోర్డు మెంబర్ వెంకన్న బాబు, మండల ప్రధాన కార్యదర్శి ముప్పిడి నాగేశ్వరరావు, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ కాకి మణికంఠ, మండిగ వెంకన్న దొర, దాసరి నరసింహారావు, గొంతెన బాపిరాజు, మామిడి వీర వెంకట సత్యనారాయణ, ముమ్మిడివరపు రామకృష్ణ, ముక్క శ్రీను, అడప దొరబాబు, అప్పలరాజు ఆదం మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# దానధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు మైక్ సెట్లు పంపిణీ






**ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 18 :** వెనుకబడిన దేవాలయాలకు దానధర్మ ట్రస్ట్ వారిచే మైక్ సెట్లు ఇవ్వడం జరుగుతుందని ట్రస్ట్ సభ్యురాలు నేదూరి జయలక్ష్మి అన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం తామరాడ మరియు ప్రత్తిపాడు మండలం టి రాయవరం గ్రామాల్లో రెండు మైక్ సెట్లు బహూకరించడం జరిగిందని ఆమె తెలిపారు.ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ గ్రామదేవతల ఆలయాలు బాగు చేసుకుందామని,మన హిందూ ధర్మాన్ని సంస్కృతిని కాపాడుకోవాలని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శివ,సతీష్ పాల్గొన్నారు.

# మహిళల పై జరుగుతున్న అగాహిత్యలపై అవగాహన





**రావులపాలెం పెన్ పవర్ మార్చ్ 18:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ సీఐడీ డాక్టర్ రవిశంకర్ అయ్యర్ ఆదేశాల తో మంగళ వారం రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమములో మహిళల భద్రత. వారికున్న హక్కులు చట్టాల ప్రస్తుతం కొత్తగా వచ్చిన చట్టాలు కోసం వివరించారు.సైబర్ నేరాల. నియంత్రణ. వాటిపై అప్రమత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.ఈ కార్యక్రమము లో అష్మఫేర్విన్ అడిషనల్ ఎస్పీ సీఐడీ వారి ఉత్తర్వుల మ తో కె ఏ స్వామి ఇన్స్పెక్టర్ సీఐడీ.జె జె రత్న ప్రసాద్ ఇన్స్పెక్టర్ సీఐడీ బి వెంకటేశ్వర రావు ఇన్స్పెక్టర్ సీఐడీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సపాల్ సీఐడీ సిబ్బంది. కాలేజి సిబ్బంది. పాల్గొన్నారు

# మండపేట కు నిధులు కేటాయించాలి.

**అసెంబ్లీ లో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు .**



**మండపేట. పెన్ పవర్. మార్చి 18:**ఎన్ ఆర్ జి ఎస్ నిధుల్లో వెనుక బడ్డ మండపేట నియోజకవర్గానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అదనం గా నిధులు కేటాయించాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. అసెంబ్లీ లో మంగళవారం ఆయన తన గళాన్ని వినిపించారు. జాతీయ ఉపాధిహామి పథకం ద్వారా వచ్చే గ్రాంటు కొన్ని జిల్లాలలో సుమారు రూ.30.00 నుండి 40.00 కోట్లు ఇస్తున్నారని వివరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ జిల్లాలో అయితే కనీసం రూ.20.00 కోట్లు, రాజమండ్రి కి కనీసం రూ.18.00 కోట్లు ఇచ్చారన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా లోని తన మండపేట నియోజకవర్గంలో రూ.5.50 కోట్లు చాలా తక్కువగా ఇచ్చారని అవేదన వ్యక్తం చేశారు.దీనిని అందరికి సమన్యాయం చేయలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రకరకాల స్కీముల ద్వారా వచ్చేగ్రాంటును, జాతీయ ఉపాధిహామి పథకం ద్వారా తక్కువ గ్రాంటు వచ్చే నియోజకవర్గాలకు బదలయిస్తు ఎక్కువ గ్రాంటు ఇవ్వాలని డిప్యూటి సి.ఎం, పంచాయితీరాజ్ శాఖా మంత్రి పవన్ కళ్యాణ్ ని అసెంబ్లీ సమావేశంలో అంచనాల కమీటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు కోరారు.

## సీనియర్ రాజకీయ వేత్త యనమలకు రాజ్యసభ ఇవ్వాలి.

**ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు.**




**మండపేట. పెన్ పవర్. మార్చ్ 18:**శాసన మండలిలో సుమారు ఏడుగురు ఎమ్మెల్సీల పదవీ కాల పరిమితి ముగియనుంది. ఈ నేపథ్యంలో శాసన మండలి లో వారికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నిష్ణాతులైన వారి సేవలు ప్రభుత్వాలు ఇప్పటి వరకు వినియోగించుకున్నాయని పేర్కొన్నారు. తనకి అత్యంత సన్నిహితుడు తన సహచర రాజకీయ ప్రయాణంలో కలిసి ప్రయాణించిన సీనియర్ రాజకీయవేత్త యనమల రామకృష్ణుని గూర్చి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, వివిధ శాఖ మంత్రులు గా పనిచేసిన యనమలకు రాజ్యసభ పదవి ఇవ్వాలన్నారు. ఆయనకు ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలపై ఉన్న నిష్ణాతనమైన పరిజ్ఞానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. యనమల వంటి బహుముఖ ప్రజ్ఞాశాలిని రాజ్యసభకు పంపడం ద్వారా సీనియారిటీ ను గౌరవించడమే కాకుండా తమను తమే గౌరవించుకోవడమేననీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు.

# గేదెను ఢీకొని ద్విచక్ర వాహన దారుడు మృతి,ఒకరికి గాయాలు...

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న...
- దేవీపట్నం ఎస్సై కె.షరీఫ్..



**దేవీపట్నం,పెన్ పవర్,మార్చ్ 18:**మండలంలోని పెద్ద నూతులు గ్రామం నుంచి పండల సూర్యప్రకాశ్ రెడ్డి తన స్నేహితుడు చెదల రామిరెడ్డి తో కలిసి ద్విచక్ర వాహనంపై మంటూరు గ్రామం వస్తుండగా పోతవరం గ్రామ శివారులో రాత్రి 7:40 నిమిషములకు రోడ్డుకు అడ్డంగా అకస్మాత్తుగా ఒక గేది అడ్డు రావడంతో చీకటి సమయం కావడంతో బండిని అదుపు చేయలేక గేదెను ఢీకొని రోడ్డు మీద పడిపోవడంతో తలకు తీవ్ర గాయం అయినది. అదేవిధంగావెనుక కూర్చున్న అతని మిత్రునికి చిన్న చిన్న గాయాలు అయ్యాయి.వెంటనే బంధువులు ఆసుపత్రికి తరలించగా మంగళవారం తెల్లవారుజామున 04.06 నిముషాలు కు మంటూరు గ్రామమునకు చెందిన పండాల సూర్య ప్రకాష్ రెడ్డి(32) తీవ్ర గాయాలతో మృతి చెందినట్లు దీనిపై క్రైమ్ నెంబర్ 17/2025యూ/ఎస్ 106(1) బి.ఎన్.స్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు దేవీపట్నం ఎస్ఐకే షరీఫ్ తెలియజేశారు, అనంతరం ద్విచక్ర వాహనదారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినదిప్రతి ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం ను నడపవలెనని ముఖ్యంగా టర్నింగ్ సెంటర్లో హార్న్ మోగించి నెమ్మదిగా ప్రయాణం చేయవలెను స్పీడ్ బ్రేకర్లు ఉన్న చోట్ల ఆగి నెమ్మదిగా వెళ్ళవలెనని తెలియజేశారు.

## గ్రామస్థాయిలో బిజెపిని బలోపేతం చేయాలి.....

- జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు





**ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 18 :** గ్రామ స్థాయిలో బిజెపిని బలోపేతం చెయ్యాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిని విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని రాచపల్లి జంక్షన్ సమీపంలో గెస్ట్ హౌస్ వద్ద ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కార్యకర్తల సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు ఊటా వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ విజయానికి బూత్ కమిటీలే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ కూటమి ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ విజయానికి ప్రధాన కారణం బూత్ కమిటీలే అన్నారు. నియోజకవర్గంలో 227 పోలింగ్ బూత్ లుకు 160 బూత్ కమిటీలు ఏర్పాటు చేసామన్నారు. త్వరలోనే మిగిలినవి ఏర్పాటు చేస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో 1000 ఇళ్లలపై రాబోయే పక్షం రోజుల్లో బీజేపీ జెండాలు రెపరెపలాడాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల మాజీ అధ్యక్షుడు కంద వీర స్వామి, గున్నా బత్తుల రాజబాబు, దేవర రామకృష్ణ యాదవ్, నానిపల్లి శ్రీనివాస్, గోనగానీ గోపి, రామకుర్తి సూర్యనారాయణ, తేజ మూర్తుల ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు

## ఆధార్ అప్డేట్ ప్రత్యేక కౌంటర్లను సద్వినియోగం చేసుకోవాలి



**గోకవరం పెన్ పవర్ మార్చి 18:** భారతీయ తపాలా శాఖ రాజమండ్రి పోస్టల్ డివిజన్ ఆధ్వర్యములో ఆధార్ మొబైల్ ఫోన్ అనుసంధానం, అప్డేట్ కొరకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులోనికి తీసుకువచ్చిందని, వీటిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం డివిజన్ పోస్టల్ అధికారి తాతు నాయుడు కోరారు.మంగళవారం గోకవరం పోస్ట్ ఆఫిస్ ను సందర్శించిన ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాజమండ్రి ప్రధాన పోస్టాఫీసుతో పాటుగా దానవాయిపేట,ఆర్యాపురం, శ్రీరామ్ నగర్, ధవళేశ్వరం, కడియం, ద్వారపూడి, అనపర్తి, మండపేట, రామచంద్రపురం పోస్టాఫీసులతో పాటు ఇతర పోస్టాఫీసులలో వందకు పైగా మొబైల్ అప్డేట్ కౌంటర్లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల నుండి ప్రత్యక్ష నగదు బదిలీలకు, రైతులకు భూ ఆధార్ రిజిస్ట్రీ కొరకు, కేంద్ర ఆరోగ్య శాఖ ద్వారా ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల జారీ కొరకు, ఒకే దేశం, ఒకే రేషన్ కార్డు పథకం కొరకు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర ఆర్.టి.ఒ. సేవల కొరకు, ఉద్యోగుల ఈపిఎఫ్ సేవల కొరకు, ఆదాయపు పన్ను ఈ ఫైలింగ్ , ఇతర ప్రభుత్వ పథకాల కొరకు ఆధార్ మొబైల్ అనుసంధానం , అప్డేట్ అనివార్యం అని, అంతేకాక పేరు, పుట్టిన తేదీ, లింగ మరియు చిరునామా మార్పులు ఆన్లైన్ ద్వారా స్వయంగా మార్పు చేసుకొనుటకు కూడా ఆధార్ మొబైల్ అనుసంధానం తప్పనిసరి కాబట్టి ప్రజలందరూ పోస్టాఫీసులో లభించే ఈ సేవలను వినియోగించుకోవలసినదిగా డివిజన్ పోస్టల్ అధికారి తాతు నాయుడు కోరారు.

# చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు పవిత్ర దేవాలయాలతో సమానం.





- పరిసరాల పరిశుభ్రత ప్రజలు బాధ్యతగా తీసుకోవాలి.
- సామాజిక ఉద్యమకారుడు పాఠంశెట్టి సూర్యచంద్ర.

**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 18 :** చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు పవిత్ర దేవాలయాలతో సమానమని, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు పాఠంశెట్టి సూర్యచంద్ర అన్నారు. మంగళవారం తమ స్వగ్రామం బూరుగుపూడిలో ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి, కొణిదెల పవన్ కళ్యాణ్ ల ఆశయంలో భాగంగా, ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా విజన్ 2047 సాధన కోసం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని పాఠంశెట్టి సూర్యచంద్ర అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పారిశుధ్య సిబ్బందికి, గ్రామ సర్పంచ్ కి తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సహకారంతో జగ్గంపేట నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాల అభివృద్ధికి, పారిశుధ్య మెరుగుదలకు కృషి చేస్తానని సూర్యచంద్ర తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ గ్రామాల అమలు కోసం అహర్నిశలు పనిచేశామని ముఖ్యమంత్రి పిలుపుతో,స్ఫూర్తితో మరలా నేటి నుండి అన్ని గ్రామాలలో పర్యటించి పారిశుధ్య మెరుగుదలకు, ఆరోగ్య గ్రామాలు సాధన కోసం కృషి చేస్తానని పాఠంశెట్టి సూర్యచంద్ర తెలిపారు. తడి ,పొడి చెత్తలను ఇంటి వద్దనే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలని, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతగా భావించాలని పాఠంశెట్టి సూర్యచంద్ర ప్రజలను కోరారు. పరిసరాలు పరిశుభ్రత, తడి,పొడి చెత్తలను వేరు చేయుట, ఇంకుడు గుంతల నిర్మాణం, బహిరంగ మలవిసర్జన నిర్మూలన మొదలగు అనేక అంశాలపై గ్రామాల్లో సామాజిక స్పృహ కలిగి ఉన్న యువతి,యువకులు సమాజం కోసం స్వచ్ఛందంగా బాధ్యత తీసుకోవడమే కాకుండా, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ సాధనలో పాల్గొనాలని యువతకు పిలుపునిచ్చారు.

# విద్యావ్యవస్థలో చేపట్టాల్సిన మార్పులపై అసెంబ్లీ లో మాట్లాడిన ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 18 :**ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో పాటించాల్సిన నియమ నిబంధనల గురించి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళవారం అసెంబ్లీలో చర్చించారు. ముందుగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 117 ని సవరణ చేసి అందరి ఎమ్మెల్యే లతో చర్చించి ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వ కళాశాలలను సక్రమంగా నడపాలని మోడల్ స్కూల్స్ నెలకొల్పాలన్న విద్యాశాఖ మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలియజేశారు.అదే విధంగా ప్రైవేటు పాఠశాలల్లో టెక్నో డిజిటల్ అపార్ట్మెంట్ స్కూల్స్ కాన్సెప్ట్ ఉందా అని పాఠశాల నిబంధనలు ఎంతవరకు ప్రైవేటు పాఠశాలలు పాటిస్తున్నాయని దానిపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. జి ప్లస్ వన్ దాటిన పాఠశాలల కు ఫైర్ సెక్యూరిటీ కల్పించాలని, తప్పనిసరిగా ప్రైమరీ స్కూలు పిల్లలకు మెట్ల దారి ఏర్పాటు చేయాలని వారు కూడా మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి లేకుండా గ్రౌండ్ ఫ్లోర్ లోనే తరగతులు నిర్వహించే లా చర్యలు చేపట్టాలని కోరారు. అదే విధంగా పాఠశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందుబాటులో ఉండేటట్లు చూడాలని పాఠశాల పరిసరాలలో హాస్పటల్ ఏర్పాటు ఉండేటట్లు చర్యలు చేపట్టాలని కోరారు.ప్రతి పాఠశాలలోనూ ప్లే గ్రౌండ్ ఉండేటట్లుగా చర్యలు చేపట్టాలని తద్వారా విద్యార్థులు శారీరకంగా దృఢత్వాన్ని పొంది ఒబిసిటీ, ఊబకాయం వంటి సమస్యలు రాకుండా నియంత్రించడం సాధ్యమవుతుందని తెలిపారు. అదే విధంగా పాఠశాలల్లో తప్పనిసరిగా డ్రిల్, క్రాఫ్ట్ ,డ్రాయింగ్ వంటి పిరియడ్లు ఉండేటట్లు చర్యలు చేపట్టాలని కోరారు.ఎన్. సి.సి.లో కూడా పిల్లలకు శిక్షణ ఇప్పించే ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా విద్యా సంస్థల్లో చదువులో రాణిస్తున్న10 శాతం మంది పై మాత్రమే దృష్టి సారించి 90 శాతం విద్యార్థులకు ఎటువంటి నైపుణ్య శిక్షణ లేకుండా చేయడం వల్ల విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడే అవకాశం ఉందని దీనిని నియంత్రించడానికి చర్యలు చేపట్టాలని అన్నారు.మంత్రి పై సూచనలను పరిశీలించి విద్యావ్యవస్థను చక్కదిద్దేందుకు తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఘనంగా గరగల సంబరాలు.







**కిర్లంపూడి,పెన్ పవర్, మార్చి 18 :** మండల కేంద్రమైన కిర్లంపూడిలో వేంచేసియున్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి ఘనంగా గరగల సంబరాలు నిర్వహించారు. కిర్లంపూడి రమణయ్యపేటకు చెందిన అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత సేనాపతి కన్నబాబు, విజయ దంపతులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన గరగల సంబరాల్లో భాగంగా డప్పు వాయిద్యాలతో నిర్వహించిన గరగల నృత్యాలు ఆద్యాంతము చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తొలుత ఆలయంలో సేనాపతి కన్నబాబు,విజయ దంపతులు, కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకోవడమే కాకుండా,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారికి పాన్పు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేనాపతి కన్నబాబు కుటుంబ సభ్యులతో పాటు, కిర్లంపూడి గ్రామానికి చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

# మడికి సచివాలయ కార్యదర్శికి పదోన్నతి.



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 18:** ఆలమూరు మండలం మడికి సచివాలయం-2 కార్యదర్శి షేక్ మహమ్మద్ అలీ కి గ్రామపంచాయతీ గ్రేడ్ 4 కార్యదర్శిగా పదోన్నతి లభించింది. మంగళవారం కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కౌన్సిలింగ్ లో ఈయనను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చెట్టి గ్రామపంచాయతీకి నియమించారు.గ్రామ సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శిలకు గ్రామ పంచాయతీ గ్రేడ్ 4 కార్యదర్శిలుగా పదోన్నతులు కల్పించారు. అందులో భాగంగా ఆలమూరు మండలంకు సంబంధించి అలి ఒక్కరకే అవకాశం వచ్చింది.

## మరణానంతరం పూడ్చిపెట్టిన బాలుని శవానికి పోస్టుమార్టం





**వై. రామవరం,పెన్ పవర్, మార్చి 18 :** ఎదురెదురుగా మోటార్ సైకిల్ లు ఢీకొన్న ప్రమాదంలో మరణించిన బాలుడు కర్ర జస్విక్ రెడ్డి (4), పూడ్చిపెట్టిన శవాని కి మంగళవారం సంఘటన స్థలంలో పోస్టుమార్టం నిర్వహించడం జరిగిందని వై రామవరం ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8వ తేదీ సాయంత్రం ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ లు ఢీకొని, తన కుమారుడు మరణించాడని దీనికి బాధ్యుడైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మృతి చెందిన బాలుని తల్లి కర్ర నాగ దేవి రంపచోడవరం డిఎస్పి కి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే నని అన్నారు. ఇదే సంఘటనపై వై.రామవరం పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేయడంతో మంగళవారం సీఐ నరసింహమూర్తి, తాసిల్దార్ వేణుగోపాల్, డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో పోస్ట్ మార్టం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కే. ఎర్రగొండ సర్పంచ్ వెదుళ్ళ సత్తిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారని తెలిపారు. శవ పంచనామ నిర్వహించడం జరిగిందన్నారు. మరణించిన బాలుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

## గంగవరంలో వాహనాల తనిఖీ




**గంగవరం, పెన్ పవర్, మార్చి 18:**వాహనదారులు అధిక వేగంతో వాహనాలు నడిపి ప్రాణాలపై తీసుకొచ్చుకోవద్దని గంగవరం అడిషనల్ ఎస్సై ఆర్ రాంబాబు సూచించారు. మంగళవారం గంగవరం పోలీస్ స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అడ్డతీగల- గోకవరం ప్రధాన రహదారిలో వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. వాహనాలు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించుకోవాలని, మైనర్లకు వాహనాల డ్రైవింగ్ వద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాంబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# డ్వాక్రా సంఘాల్లోకి మళ్లీ రుణాలు జమ ఆందోళన చెందుతున్న మహిళలు





**రాజవొమ్మంగి ,పెన్ పవర్, మార్చి 18:** రాజవొమ్మంగి యూనియన్ బ్యాంక్ లోని డ్వాక్రా సంఘాల అనుమతులే లేకుండానే రుణాలు మంజూరు చేశారంటూ రాజవొమ్మంగి వెలుగు కార్యాలయం వద్ద డ్వాక్రా సంఘ మహిళలు ఆందోళన చేపట్టారు తంటికొండ పంచాయితీ ఒట్టిగెడ్డ గ్రామంలో 33 డ్వాక్రా సంఘాలు ఉండగా అందులో కావేరి,సంధ్య, ప్రియదర్శిని, రమ్య,వనిత,దివ్య,సాయి 15 డ్వాక్రా సంఘాలకు ఎటువంటి అనుమతులు లేకుండా రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు వారు ఖాతాల్లోకి రుణాలు మంజూరు చేసి తిరిగి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసుకోవడంపై ఆంతర్యం ఏమిటో అని డ్వాక్రా మహిళలు ఆందోళన చెందుతున్నారు ఇప్పటికే పోలీసు వారు ఆన్లైన్ మోసాలు నమ్మొద్దు అంటూ గ్రామాల్లో అవగాహన సదస్సులు చేపట్టినప్పటికీ బ్యాంకు వారే ఇలాంటి లావాదేవీలు చేస్తుంటే బ్యాంకులో డబ్బులు జమ చెయ్యాలంటే భయాందోళనకు గురవుతున్నారని కొందరు ప్రజలు వాపోతున్నారు గత నెలలో దుసరపాము పంచాయతీ డ్వాక్రా సంఘాలవారు ఆందోళన చేపట్టారు మళ్లీ రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు లో ఈ ఘటన చోటు చేసుకుంది బ్యాంకుకు వెళ్లే మహిళలు ముఖ్యంగా బ్యాంకులో ఉండే ప్రింటర్ పనిచేయకపోవడం వల్ల బ్యాంకు వారు వారికి నచ్చిన ఖాతాల్లో లావాదేవీలు జరుపుతున్నారని వాపుతున్నారు బ్యాంకులో ప్రజలకు ప్రింటింగ్ చాలా అవసరమని తెలిసినప్పటికీ బ్యాంకు వారు ఏజెన్సీ ప్రజల్ని బురిడీ కొట్టించడం కోసం బ్యాంకులో ప్రింటర్ బాగు చేయలేకపోతున్నారని అపోహలు ఆ నోటా ఈ నోటా వినిపిస్తున్నాయి ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు రాజవొమ్మంగి యూనియన్ బ్యాంకు పై పూర్తి విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటారని డ్వాక్రా మహిళలు సామాన్య ప్రజలు అంటున్నారు.



| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 172 | VATTIGADA | 88 | DEVI | 049910031001164 | 30.6.2024 | 650000 | 3.7.2024 | 3 | 1 | 650 |
| 173 | | | | | 31.7.2024 | 600000 | 7.8.2024 | 7 | 1 | 1587 |
| 174 | | | | | 29.8.2024 | 710000 | 5.9.2024 | 6 | 1 | 1420 |
| 175 | | 89 | DIVYA | 049910011103808 | 30.6.2024 | 750000 | 3.7.2024 | 3 | 1 | 750 |
| 176 | | | | | 29.8.2024 | 770000 | 5.9.2024 | 6 | 1 | 1540 |
| 177 | | | | | 30.11.2024 | 800000 | 30.11.2024 | 1 | 1 | 267 |
| 178 | | 90 | INDIRA 2 | 049910031001181 | 30.60.2024 | 600000 | 3.7.2024 | 3 | 1 | 600 |
| 179 | | | | | 31.7.2024 | 650000 | 7.8.2024 | 8 | 1 | 1733 |
| 180 | | | | | 29.8.2024 | 670000 | 31.8.2024 | 2 | 1 | 447 |
| 181 | | 91 | INDIRAPRIYADARSHI | 049910031000774 | 31.6.2024 | 750000 | 3.7.2024 | 3 | 1 | 750 |
| 182 | | | | | 31.8.2024 | 820000 | 5.9.2024 | 5 | 1 | 1367 |
| 183 | | 92 | KAVERI | 049910031001173 | 28.6.2024 | 640000 | 3.7.2024 | 4 | 1 | 853 |
| 184 | | | | | 31.7.2024 | 660000 | 5.8.2024 | 5 | 1 | 1100 |
| 185 | | | | | 29.8.2024 | 710000 | 31.8.2024 | 2 | 1 | 473 |
| 186 | | 93 | PODUPULAXMI | 049910031000769 | 30.6.2024 | 600000 | 3.7.2024 | 3 | 1 | 1200 |
| 187 | | | | | 31.7.2024 | 650000 | 5.8.2024 | 5 | 1 | 1083 |
| 188 | | | | | 29.8.2024 | 690000 | 3.9.2024 | 4 | 1 | 920 |
| 189 | | 94 | PRIYADARSHI | 049910031000733 | 29.8.2024 | 630000 | 31.8.2024 | 2 | 1 | 420 |
| 190 | | 95 | RAMYA | 049910031001175 | 30.6.2024 | 750000 | 3.7.2024 | 3 | 1 | 750 |
| 191 | | | | | 31.7.2024 | 780000 | 7.8.2024 | 7 | 1 | 1820 |
| 192 | | | | | 29.8.2024 | 810000 | 5.9.2024 | 6 | 1 | 1620 |
| 193 | | 96 | SAI | 049910031000724 | 30.6.2024 | 600000 | 3.7.2024 | 3 | 1 | 600 |
| 194 | | | | | 31.7.2024 | 630000 | 7.8.2024 | 7 | 1 | 1470 |
| 195 | | 97 | SAI 2 | 049910031001183 | 30.6.2024 | 600000 | 3.7.2024 | 3 | 1 | 600 |
| 196 | | | | | 31.7.2024 | 660000 | 7.8.2024 | 7 | 1 | 1540 |
| 197 | | | | | 29.8.2024 | 650000 | 5.9.2024 | 6 | 1 | 1300 |
| 198 | | 98 | SEETHARAMA | 049910031000556 | 29.12.2023 | 600000 | 4.1.2024 | 4 | 1 | 800 |
| 199 | | | | | 16.5.2024 | 800000 | 31.5.2024 | 15 | 1 | 4000 |
| 200 | | 99 | SEETHARAMA 2 | 049910031000557 | 29.12.20223 | 700000 | 2.1.2024 | 3 | 1 | 700 |
| 201 | | | | | 16.5.2024 | 950000 | 27.5.2024 | 11 | 1 | 3483 |
| 202 | | 100 | THULASI | 049910031000933 | 30.6.2024 | 600000 | 3.7.2024 | 3 | 1 | 600 |
| 203 | | | | | 31.7.2024 | 660000 | 7.8.2024 | 7 | 1 | 1540 |
| 204 | | | | | 29.8.2024 | 690000 | 5.9.2024 | 6 | 1 | 1380 |
| 205 | | 101 | VANITHA | 049910100092901 | 30.6.2024 | 600000 | 3.7.2024 | 3 | 1 | 600 |
| 206 | | | | | 31.7.2024 | 600000 | 7.8.2024 | 7 | 1 | 1400 |
| 207 | | 102 | SANDHYA | 049910100021143 | 31.5.2024 | 700000 | 5.6.2024 | 5 | 1 | 1167 |
| 208 | | | | | 21.6.2024 | 1418000 | 9.7.2024 | 18 | 1 | 8508 |
| 209 | | | | | | 109930000 | | | | 220165 |
| 210 | | | | | | | | | | |
| 211 | | | | | | | | | | |
| 212 | | | | | | | | | | |
| 213 | | | | | | | | | | |

# అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టివేత





ఏడుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

**అనకాపల్లి, పెన్ పవర్, మార్చి 18 :** అక్రమంగా రవాణా చేస్తున్న 363 కేజీల గంజాయిని, 7 గురు నిందితులు అరెస్టు చేసి, రెండు కార్లు, రూ.50 వేలు నగదు మరియు 5 మొబైల్ ఫోన్లను సుమారు మొత్తం రూ.57.10 లక్షల విలువైనవి సబ్బవరం పోలీసులు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. సబ్బవరం, మార్చి 18, మధ్యాహ్నం 12:00 గంటల సమయంలో మర్రిపాలెం టోల్గేట్ వద్ద గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వారిని అరెస్ట్ చేసి, వారితో రహస్యంగా తీసుకెళ్లిన ఫార్చునర్ కారులో గంజాయి స్వాధీనం చేసుకోగా, అదే సమయంలో పైలట్ కారు బ్రెజ్జా కారు నుండి 7 నిందితులను పట్టుకున్నారు. ఆయా నిందితులలో 6 గురు ఏ.ఎస్.ఆర్. జిల్లాకు, ఒకరు ఒడిశాకు చెందిన వారు ఉన్నారు. ఈ గంజాయి ఆంధ్ర-ఒడిశా సరిహద్దు నుండి పూణెకు తీసుకెళ్తున్నారు. వారి వద్ద నుంచి కింది ప్రాపర్టీ స్వాధీనం చేసుకున్నాము. దీనిపై సబ్బవరం పోలీస్ స్టేషన్ క్రైమ్ నెం. 51/2025 యు/ఎస్20(బి)(ii)(సి) ఆర్/డబ్ల్యు8(సి) %ఆ% 25 ఆఫ్ ది ఎన్ డి పి ఎస్ యాక్ట్ 1985. కేసు నమోదు చేసి, నిందితులను ప్రేమానికి తరలించారు, మరొక ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వారిని అరెస్టు చేయవలసి ఉందన్నారు. ఈ కేసు వివరాలు పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ మీడియా సమావేశంలో తెలియజేశారు. ఈ సమావేశంలో సబ్బవరం ఇన్స్పెక్టర్ పి.రమణ, ఎస్సైలు పి.సింహాచలం, టి.దివ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సింహాచలం శ్రీ స్వామివారి ఆలయంలో ఘనంగా స్వాతి నక్షత్ర హోమం









**సింహాచలం, పెన్ పవర్, మార్చి 18 :** విశాఖజిల్లా సింహాచలంలో శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో స్వాతి నక్షత్ర హోమం ఘనంగా జరిగింది.
సర్వాభరణాలతో గోవిందరాజు స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ సుదర్శన చక్ర పెరుమాళ్ళ వేద మంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు గోత్రనామాలతో పూజలు జరిపించి వారికి యజ్ఞ ప్రసాదాన్ని అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వాతి నక్షత్ర హోమం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. యజ్ఞంలో పాల్గొన్న భక్తులంతా సింహాద్రినాథుడిని దర్శించుకుని సేవించుకున్నారు. ఈ వేడుకలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ అధికారులు చేసిన ఏర్పాట్లపై హోమానికి విచ్చేసిన భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మూగజీవల మృత్యు ఘోష





**రాజవొమ్మంగి ,పెన్ పవర్, మార్చి 18:** రాజవొమ్మంగి ,మండలం ఉర్లాకలపాడు గ్రామంలో రెండు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి వివరాల్లోకెళ్తే రాజవొమ్మంగి పశు వైద్యాధికారి తరుణ్, తెలిపిన వివరాలు ప్రకారం పశువులు ఉదయం మేతకు వెళ్లేటప్పుడు గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు భోజనాలు చేసే ప్లేట్లు వంటివి తినడంపై పశువులకు జీర్ణవాదని దానివల్ల అనేక రకాల వ్యాధులు ఏర్పడతాయని తెలిపారు.ముఖ్యంగా వేసవికాలం కావడంతో మూగజీవాలు మేత మేసి కవర్లు వంటివి తిన్నప్పుడు కడుపులో వేడి కలగడంతో దగ్గర్లో నీరు లేకపోవడం వల్ల మూగజీవాలు మృత్యువాత పడే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.ఇప్పటికైనా రైతులు, పశు వులపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు .పశు వులకు నీరు ఎప్పుడూ అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని రోజుకు ఒక్కసారి అయినా పశువులను నీటితో కడిగితే మూగజీవాల పైన పడిన ఉష్ణోగ్రత తగ్గుతుందని ఆయన వివరించారు.

## జగజ్జీవన్ రామ్ అరుణోదయ సంఘం ఔదార్యం



**గోపాలపురం,పెన్ పవర్ మార్చి 18 :**ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే తమ సంఘ సభ్యుల ధ్యేయమని జగజ్జీవన్ రామ్ అరుణోదయ సంఘం సభ్యులు చెబుతున్నారు. పెద్దగూడెం కు చెందిన కడిమి రాము కాలుకి బ్లడ్ ఇన్ఫెక్షన్ వచ్చి బాధపడుతున్నారు.విషయం తెలుసుకున్న సంఘ సభ్యులు అధ్యక్షుడు చాపల రవి నేతృత్వంలో బాధితుడి వైద్యం నిమిత్తం పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి తమ మానవత్వాన్ని నిరూపించుకున్నారు.సంఘ సభ్యుల సహాయ సహకారాలతో పలు సేవా కార్యక్రమాలు ముందు ముందు చేపట్టడం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా బాధితుడు రాము సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు.ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు మురళి,పసలపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏలేశ్వరంలో సిద్ధ్ నాథ్ జ్యువెలరీలో జరిగిన చోరీ కేసును చేధించిన పోలీసులు.

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ బిందు మాధవ్.





**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 18:** ఫిబ్రవరి 9వ తేదీన ఏలేశ్వరం ప్రధాన రహదారిలో సిద్ధనాద్ జ్యువెలరీ నందు జరిగిన చోరీని ప్రత్తిపాడు పోలీసులు చాకచక్యంగా చేధించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ మాట్లాడుతూ ఏలేశ్వరంనుండి యర్రవరం వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి సిద్ధనాథ్ జ్యువెలరీ షాపులో జరిగిన చోరీ ఘటనపై పెద్దాపురం డిఎస్పీ శ్రీహరి రాజు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి ఎస్ అప్పారావు తమ సిబ్బందితో కేసును ఛేదించారని తెలిపారు.
ఈ ఘటనలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన కరణం కుమార్ %ఆ%1 ముద్దాయిగా,కడప జిల్లా చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్యను %ఆ%2గా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.వారి వద్ద నుండి ఒక పల్సర్ టూవీలర్ బైక్,11.1/2 కేజీల వెండి, 32.8 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని అన్నారు. %ఆ% 1ముద్దాయి పై 30 దొంగతనం కేసులు ఉన్నాయని,%ఆ%2 ముద్దాయిపై 11 ఎర్రచందనం కేసులతో పాటు 10 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు.నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు . సిద్ధనాద్ జ్యువెలరీ దొంగతనం కేసును ఛేదించిన సీఐ బి ఎస్ అప్పారావు,ఏలేశ్వరం ప్రత్తిపాడు,అన్నవరం రౌతులపూడి ఎస్సైలు ఎన్. రామలింగేశ్వరరావు,ఎస్ లక్ష్మికాంతం,శ్రీహరి బాబు,జి. వెంకటేశ్వరరావులని పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారని ఈ సందర్భంగా ఎస్పీ బిందు మాధవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు.

## చెరుకుమిల్లిలో శరవేగంగా పారిశుద్ధ్యపు పనులు



**గోపాలపురం, పెన్ పవర్, మార్చి 18.** మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ముల్లపూడి వరలక్ష్మి, గ్రామ కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో గ్రామాన్ని పరిశుభ్రం చేస్తున్నారు. రహదారులను శుభ్రపరచడం, మురికి నీటి కాలువలను త్రవ్వడం, పూడిక తీత, చెత్తాచెదారం తొలగింపు వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అలాగే గ్రామంలో ఉన్న త్రాగునీటి చిన్న, పెద్ద ట్యాంకులను సిబ్బంది ద్వారా శుభ్రం చేయిస్తున్నారు. మురికి నీటి నిలువలు లేకుండా చూస్తున్నారు. రహదారులు వెంబడి బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. మండలంలో పలుచోట్ల డయేరియా వ్యాధి గ్రస్తులు ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు తెలియజేసి వారిని చైతన్య పరుస్తున్నారు.

# టైపిస్ట్ కం అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం..

- 25లోగా దరఖాస్తులు సమర్పించాలి..
- ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కం చైర్మన్, డీఎల్ఎస్ఏ..

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, మార్చి18 :** విజయనగరం లోని ఏడీఆర్/ మీడియేషన్ సెంటర్‌లో పనిచేయుటకు టైపిస్ట్ కం అసిస్టెంట్ పోస్టుకు దరఖాస్తులను కోరుతున్నట్లు విజయనగరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ మరియు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ( డీఎల్ఎస్ఏ ) చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆప్కాస్ ద్వారా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఈ పోస్టును భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక కాబడిన ఉద్యోగికి విధుల్లో చేరిన నాటి నుంచి నెలకు రూ.18,500/-లు చొప్పున ఏడాది కాలం పాటు పారితోషికం చెల్లించబడుతుందని అన్నారు.ఓపెన్ కాంపిటేషన్ కింద మహిళా అభ్యర్థులు అర్హులని,దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని అన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన ఏదైనా యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలని, ఇంగ్లీష్ టైప్ రైటింగ్ నందు హయ్యర్ గ్రేడ్ చేసి ఉండాలని అన్నారు. అటువంటి అభ్యర్థులు లేనియెడల లోయర్ గ్రేడ్ అభ్యర్థిని తీసుకోవడం జరుగుతుందని అన్నారు. 2023 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి అభ్యర్థుల వయసు 18 నిండి, 42 ఏళ్లలోపు ఉండాలని, దివ్యాంగులకు 10 ఏళ్ళు, ఎస్సి,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 5 ఏళు ,,ఎక్స్ సర్వీస్ మెన్ కు ఏపీ స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996, ఏపీ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ రూల్స్ 1992లోని నియమాల మేరకు వయసు సడలింపు ఉంటుందని అన్నారు. డిగ్రీ పాసైన సర్టిఫికేట్,వయసు,కుల నిర్ధారణ సర్టిఫికేట్లు తప్పనిసరి అని, ఇతర విద్యార్హతలు, టెక్నికల్ సర్టిఫికేట్లు ఉంటే సమర్పించవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్నిత ప్రొఫార్మాలో తమ వివరాలను పూరించి, సీల్డ్ కవరులో దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5.00గం.ల్లోగా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కం చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, కోర్ట్ కాంప్లెక్స్, విజయనగరం కార్యాలయానికి చేరేలా సమర్పించాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు, ఫోటోలు, స్వీయ సంతకం, అవసరమైన ధ్రువ పత్రాలు, పోస్టల్ స్టాంపులు అతికించని స్వంత చిరునామా గల కవర్ లేని దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవని తెలిపారు. అలాగే గడువు దాటిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా పోస్టు భర్తీ ఉంటుందని,రాత పరీక్షకు, ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి టి.ఏ,డి.ఏ చెల్లించబడదని అన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో ఒరిజినల్ సర్టిఫికేట్లు తప్పనిసరిగా చూపాలని అన్నారు.పోస్టుల ప్రక్రియ తుది నిర్ణయం చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, విజయనగరం వారిదేనని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

## అటెండర్,ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం..

- 20లోగా దరఖాస్తులు సమర్పించాలి..
- ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కం చైర్మన్, డీఎల్ఎస్ఏ..

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, మార్చి18 :** విజయనగరం లోని ఏడీఆర్/ మీడియేషన్ సెంటర్‌లో పనిచేయుటకు అటెండర్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు దరఖాస్తులను కోరుతున్నట్లు విజయనగరం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ మరియు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ( డీఎల్ఎస్ఏ ) చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆప్కాస్ ద్వారా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన అటెండర్, ఆఫీస్ సబార్డినేట్ రెండు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఎంపిక కాబడిన ఉద్యోగులకు విధుల్లో చేరిన నాటి నుంచి ఏడాది కాలానికి నెలకు రూ.15,000/-లు పారితోషికం చెల్లించబడుతుందని అన్నారు. పోస్టు లలో షెడ్యూల్డు కులాలకు చెందిన మహిళ, ఓపెన్ కాంపిటేషన్ కింద ఒక పోస్టు ఉన్నట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదని,ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ సర్వీస్ రూల్స్ 1999, ఏపీ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ రూల్స్ 1992లోని నియమాల మేరకు దరఖాస్తుదారులు 7వ తరగతి పాసై, తెలుగు చదవడం, రాయడం వచ్చి ఉండాలని, సైకిల్ తొక్కగల సామర్థ్యం కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. 2023 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి అభ్యర్థుల వయసు 18 నిండి, 42 ఏళ్లలోపు ఉండాలని, దివ్యాంగులకు 10 ఏళ్ళు, ఎస్సి,ఎస్టీ,బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 5 ఏళ్ళు సడలింపు ఉంటుందని అన్నారు. 7వ తరగతి పాసైన సర్టిఫికేట్, వయసు, కుల నిర్ధారణ సర్టిఫికేట్లు తప్పనిసరి అని, ఇతర విద్యార్హతలు, టెక్నికల్ సర్టిఫికేట్లు ఉంటే సమర్పించవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నిర్నిత ప్రొఫార్మాలో తమ వివరాలను పూరించి, సీల్డ్ కవరులో దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5.00గం.ల్లోగా

ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ కం చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, కోర్ట్ కాంప్లెక్స్, విజయనగరం కార్యాలయానికి చేరేలా సమర్పించాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు, ఫోటోలు, స్వీయ సంతకం, అవసరమైన ధ్రువ పత్రాలు, పోస్టల్ స్టాంపులు అతికించని స్వంత చిరునామా గల కవర్ లేని దరఖాస్తులు పరిగణలోకి తీసుకోబడవని తెలిపారు. అలాగే గడువు దాటిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. ఇంటర్వ్యూ ద్వారా పోస్టుల భర్తీ ఉంటుందని, ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులకు ఎటువంటి టి.ఏ,డి.ఏ చెల్లించబడదని, ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో గుర్తింపుకార్డు తప్పనిసరిగా చూపాలని అన్నారు.పోస్టుల ప్రక్రియ తుది నిర్ణయం చైర్మన్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, విజయనగరం వారిదేనని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

## అంగన్వాడి హెల్పర్స్ కు ఇంటర్వ్యూలు నిర్వహించిన పీఓ..



**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, మార్చి 18 :** పీఎం జన్ మన్ అంగన్వాడి హెల్పర్స్ ఇంటర్వ్యూ లను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మరియు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మంగళ వారం తన ఛాంబరులో నిర్వహించారు. మొత్తం ఎనిమిది పోస్టులకు గాను 13 మంది అభ్యర్థులు హాజరుకాగా, ఒక్కొక్కరిని పిలిచి ఇంటర్వ్యూ చేశారు. ఈ ఇంటర్వ్యూ ప్యానల్ లో ప్రాజెక్ట్ అధికారితో పాటు ఐసీడీఎస్ పథక సంచాలకులు డా. టి.కనకదుర్గ, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి,సీడీపీఓ తదితరులు ఉన్నారు.

## మార్చి 21న పెద్ద అగ్రహారంలో మెగా వైద్య శిబిరం

- మెగా వాలీబాల్ టోర్నమెంట్
- సిఐ వి.వరప్రసాద్



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చి 18:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం పెద్ద, చిన్న అగ్రహారం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించటం జరుగుతుందని, అలాగే మెగా వైద్య శిబిరం నిర్వహించటం జరుగుతుందని గూడెం కొత్త వీధి సిఐ వి.వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాలీబాల్ టోర్నమెంటుకు జట్లను ఆహ్వానించినట్లు తెలిపారు. సుమారు 25 జట్లు ఈ మెగా వాలీబాల్ టోర్నమెంట్లో పాల్గొంటారని తెలిపారు. అలాగే మెగా వైద్య శిబిరానికి ఎక్కువ మొత్తంలో ప్రజలు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందాలని సూచించారు. యువతను క్రీడల పట్ల ప్రోత్సహించేందుకు వాలీబాల్ టోర్నమెంట్ కండక్ట్ చేయడం జరిగిందని, ఇందులో పాల్గొన్న జట్లకు ప్రతి టీంకు వాలీబాల్ నెట్, బాల్ అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఎవరైతే ఎవరైతే గెలుపొందుతారో వారికి మొదటి, ద్వితీయ తృతీయ బహుమతులుగా ట్రోపితో పాటు నగదు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. కావున ఆసక్తిగల వారు ఈ మెగా వాలీబాల్ టోర్నమెంట్ లో పాల్గొవాలని, అలాగే అధిక మొత్తంలో ప్రజలు మెగా వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందాలని సీఐ వరప్రసాద్ మీడియా ప్రకటనలో పేర్కొన్నారు.

## గిరిజనుల సమస్యలపై గళమెత్తిన కాంగ్రెస్ నాయకులు..





- ఐటీడీఏను నిర్వీర్యం చేస్తున్నారు...!
- గిరిజనుల నిధులు గిరిజనేతరులకు వినియోగిస్తున్నారు..
- ఐ టి డి ఏ నిధులన్నీ పక్కదారి పడుతున్నాయి .
- విద్యా, వైద్యం, వ్యవసాయ సమస్యలను పరిష్కరించాలి..
- ఆదివాసి గిరిజన, రైతు సంఘాల 48 గంటల ధర్నాకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, మార్చి- 18:** గిరిజనుల సమస్యలపై భారతీయ జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు గళమెత్తారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు, సాలూరు నియోజకవర్గం ఇంచార్జ్ గేదెల రామకృష్ణ, పార్వతీపురం నియోజకవర్గం ఓబీసీ చైర్మన్ శిరసుపల్లి సాయి శ్రీనివాస్, పార్టీ నాయకులు కోలా కిరణ్, పార్వతీపురం మండల అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసి గిరిజన రైతు సంఘాలు చేపడుతున్న 48 గంటల ధర్నాకు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు గిరిజనుల ఓట్లతో పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. అంతేగాని వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నించటం లేదని ఆరోపించారు. గిరిజనుల కోసం అవతరించిన ఐటీడీఏ ను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. సకాలంలో గవర్నర్ బాడీ సమావేశాలు నిర్వహించడం లేదన్నారు. గిరిజనుల కోసం ఉపయోగించాల్సిన ఐ టి డి ఏ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. కొన్ని సందర్భాలలో గిరిజనేతరులకు కూడా వినియోగించటం బాధాకరమన్నారు. గిరిజనులకు చెందాల్సిన ఉద్యోగాలు గిరిజనేతరులు అనుభవిస్తున్నారన్నారు. తక్షణమే గిరిజన యాత్రలను ఉద్యోగాల నుండి తొలగించి, అర్హులైన గిరిజనులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఐటీడీఏ నిధులన్నీ డ్రా చేయడం జరుగుతుందన్నారు. ఒకప్పటి ఐటిడిఏ ప్రాబల్యం తగ్గి వెలవెలబోతుందన్నారు. పోషకాహారం లోపంతో అధికంగా గిరిజన ప్రజలు రక్తహీనతకు లోనవుతున్నారన్నారు. గిరిజనులు పండించే పంటలు సేకరించిన అటవీ ఫలసాయానికి గిట్టుబాటు ధరల పెంచక ఆది నుండి దళారుల చేతిలో మోసపోతున్నారన్నారు. ప్రభుత్వమే గిరిజనుల నుండి పంటలను, అటవీశాఖ ఫల సాయాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. జీడి పంటను ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి, జీడి పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతాలను వేధిస్తున్న మంచినీటి సమస్యను పరిష్కరించాలన్నారు. అవసరమైన ఇంజనీరింగ్, బిఈడి, డైట్, మెడికల్, పీజీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. గిరిశిఖర, గిరిజన గ్రామాలకు కనెక్టివిటీ రహదారులు నిర్మించి డోలీల మోతలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గిరిజన వ్యవసాయానికి విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి ఉచితంగా అందజేయాలన్నారు. పండిన పంటను గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. జిసిసి లకు ప్రాణం పోయాలన్నారు. గిరిజనులను వేధిస్తున్న విద్య, వైద్యం, వ్యవసాయ సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కారానికి గిరిజనులు చేపట్టిన ధర్నాకు తమ పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జ్ బత్తిన మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటించినట్లు పేర్కొన్నారు.

## శానిటరీ సిబ్బంది వారికి లీ ఫార్మా వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





- ముఖ్య అతిధిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం

**గాజువాక: పెన్ పవర్, మార్చి18** జీవియంసి 87వ వార్డ్ పరిధిలో దువ్వాడ జోన్లో ఉన్న లీ ఫార్మా లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి, 87వ వార్డ్ కార్పొరేటర్ బోండా జగన్నాథం పాల్గొని మాట్లాడుతూ మన పరిసరాలు శుభ్రంగా ఉంటున్నాయంటే పారిశుద్ధ కార్మికుల వల్లేనని అటువంటివారిని దృష్టిలో పెట్టుకొని లి ఫార్మా లిమిటెడ్ వారు మానవతా హృదయంతో వారికి ఉచిత శిబిరం ఏర్పాటు చేయడమే కాక వారికీ మందులు మరియు పౌష్టిక ఆహారం అందజేయడం ఓ మంచి కార్యక్రమం అని ఇంత మంచి కార్యక్రమం లో నన్ను భాష్యం చేసిన లీ ఫార్మా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు రాజన్ రాజు, అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, జనసేన వార్డ్ అధ్యక్షులు శిరసపల్లి కనకరాజు, సీనియర్ నాయకులు ప్రగడ దానయ్య, ఆనంద్ కుమార్, దాలయ్య, కడుపుట్ల శ్రీను, జాన్ రమేష్, లీ ఫార్మా డైరెక్టర్ అల్లా లీలారాని, డాక్టర్ పి రఘుబాబు, సిబ్బంది ఫణి కుమార్, సరోజిని,మాధురి, భాగ్యలత, సానిటరీ ఇన్స్పెక్టర్ అప్పారావు, మూర్తి, శ్రీను మరియు సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కైలాస నాద ఆలయ 42 వ వార్షికోత్సవ యాత్ర మహోత్సవం



**గుమ్మ లక్ష్మీపురం 18, మర్చి పెన్ పవర్.** గుమ్మ లక్ష్మీపురం లో జరగనున్న శ్రీ ఉమా సాహిత కైలాసనాథ ఆలయ 42వ వారోత్సవ యాత్ర మహోత్సవాల సందర్భంగా ఆహ్వాన పత్రికను మంగళవారం నాడు గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ.గౌరీ శంకర్రావు చేతులమీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ బొత్తాడ.గౌరీ శంకర్రావు మాట్లాడుతూ, 42వ వార్షికోత్సవ యాత్ర మహోత్సవాలు ఈనెల 25 వ, తేదీ నుంచి 29 వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని కరపత్రాలు ద్వారా మరియు మీడియా ద్వారా తెలియజేస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా ఈ యాత్ర మహోత్సవాల్లో భాగంగా వివిధ వినోద, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందువలన పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ యాత్ర మహోత్స కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్:- పాలక. ప్రేమానందు, ఏజెన్సీ ప్రెస్ క్లబ్ కార్యదర్శి :-బేతా కుమార్ స్వామి,కమిటీ సభ్యులు:- కే.విష్ణు ప్రసాద్, పి. నాగేశ్వరరావు, కే.సూర్యం, మద్ది. దొర,మురళి, వహీద్ ఖాన్,నాగరాజు,పాండు తదితరులు పాల్గొన్నారు.

## వాలంటీర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

జి. మాడుగుల మండల వాలంటీర్ నాయకులు



**జి.మాడుగుల,పెన్ పవర్, మార్చి 18:** కూటమి పార్టీ అధికారంలోనికి వస్తే వాలంటీర్లకు నెలకు పదివేల రూపాయలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్నా వాలింటర్స్ కోసం ఆలోచన చేయకుండా ప్రభుత్వం రోజుకో నాటకం ఆడుతూ దాటవేస్తున్నారని జి. మాడుగుల మండలం వాలంటీర్లు, మండల నాయకులు కుర్మన్ రాజు, కొండబాబు, సిదారి చిన్నారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చి వాలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఎపి గురుకుల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ



**పాడేరు,పెన్ పవర్ మార్చి 18** అల్లూరి జిల్లాలో ఆంధ్ర ప్రదేశ్ గురుకుల విద్యాలయాలంలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్మానిస్తున్నారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఆంధ్ర ప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు.ఈ నెల 31 తేదీన 6,7,8 తరగతలులో బ్యాక్ ల్యాగ్ సీట్లు భర్తీకి, జూనియర్ ఇంటర్మీడియట్, మరియు డిగ్రీలో ప్రవేశాలకు సీట్లు భర్తీ చేస్తున్నారని చెప్పారు.అర్హులైన విద్యార్థులు http://apr.apcfss.in వెబ్సైట్లో లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హత ఆసక్తి కలిగిన విద్యార్ధులు ఈనెల 31 వతేదీలో దరఖాస్తు చేయాలన్నారు.ఏప్రిల్ 25 వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తాటిపూడి జిల్లా కో ఆర్డినేటర్,ఎపి ఆర్ ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జె. ఎన్.సంధ్యా భార్గవి,అసిస్టెంట్ కమీషనర్ (ఎగ్జామినేషన్స్) శశి కుమార్,పిజిటి ప్రతిభా భారతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో దోమల మందు పిచికారి.



**గుమ్మలక్ష్మీపురం. 18 పెన్ పవర్ :** దుడ్డుఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వనకాబడి గ్రామానికి, పార్వతీపురం మన్యం జిల్లా, మలేరియా అధికారి వారి ఆదేశాల మేరకు,వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నాడు మలేరియా దోమల మందు పిచికారి చేయడం జరిగింది.

ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మలేరియా జ్వరాలు విజృంభిస్తున్న కారణంగా, మలేరియా కేసులను తగ్గించే దిశలో ఏ. సి.ఎం 5% అనే దోమల మందును ప్రతి ఇల్లు అన్ని గదుల్లో పిచికారి చేయడం జరిగిందని ఆయన అన్నారు. అంతేకాకుండా వనకాబడి గ్రామ ప్రజలకు దోమతెరలు కట్టడంపై అవగాహన కల్పిస్తూ, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా చక్కగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గ్రామంలో సిబ్బంది చేస్తున్న ఎన్.సి.డి సర్వే ను పరిశీలించి ప్రజలను అడిగి తెలుసుకున్నామన్నారు, అంతేకాకుండా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులను తనిఖీ చేసి వైద్య సేవలు అందించామన్నారు. ఈ కార్యక్రమానికి మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ :- పి. రాజశేఖర్, ఎం.పి.హెచ్.ఈ. ఓ :- సత్యరాజు, ఏ. ఎన్.ఎం :- ఏ. గీత, ఎం.ఎల్. హెచ్.పి :- ప్రశాంత్, హెల్త్ అసిస్టెంట్ :- గోవింద్, ఆశ వర్కర్ :- కాంతమ్మ తదితరులు ఉన్నారు.

# సౌత్ కోస్ట్ రైల్వే జోన్ త్వరితగతిన ప్రారంభిం చాలి ఎం.పీ.భరత్

- జనరల్ మేనేజర్ మరియు డివిజనల్ రైల్వే మేనేజర్
- నియామకాల్ని త్వరితగతిన పూర్తి చేయాలి ఎం.పీ.భరత్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,విశాఖపట్నం, మార్చి 18** :పార్లమెంటులో జరిగిన రైల్వే డిమాండ్ ఫర్ గ్రాం ట్స్ చర్చలో విశాఖపట్నం ఎం.పీ.భరత్ పాల్గొని 2.5 లక్షల కోట్లు కేటాయింపు పై హర్షం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ ద్వారా ప్రయాణికులకు మ రింత సౌకర్యవంతమైన, సురక్షితమైన, వేగవం తమైన రవాణా అవకాశాలు కల్పించడంతో పాటు, సరుకు రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి తోడ్పడుతుందని ఆయ న పేర్కొన్నారు.132 ఏళ్ల వాల్తేర్ డివిజన్‌ను రిటైన్ చేయడాన్ని మరియు దానిని విశాఖప ట్నం డివిజన్‌గా పునఃనామకరణం చేయడాన్ని ఎం.పీ.భరత్ హర్షించారు. అదేవిధంగా, జనర ల్ మేనేజర్ కార్యాలయం నిర్మాణానికి టెండర్లు పిలవడాన్ని అభినందిస్తూ, గత అయిదేళ్లుగా రైల్వే మౌలిక సదుపాయాల ఆధునీకరణపై కేం ద్ర ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతను ప్రశంసిం చారు.భారతీయ రైల్వే ఆదాయంలో సరుకు ర వాణా కీలక పాత్ర పోషిస్తున్నందున,ఎంపీ భరత్ పలు ముఖ్యమైన చర్యలను సూచించారు:

సరుకు రవాణా ఆదాయాన్ని మెరుగుపరచడం: రైల్వే మొత్తం ఆదాయంలో 37% వరకు సరుకు రవాణా భాగస్వామ్యం ఉండి, సంవత్సరానికి 40,000 కోట్లకు పైగా ఆదాయాన్ని అందిస్తుంద ని ఎం.పీ భరత్ పేర్కొన్నారు. అయితే, ప్రయా ణికుల టికెట్ రేట్లను తక్కువగా ఉంచడం వల్ల, సరుకు రవాణా ఛార్జీలు అధికంగా ఉండటంతో రోడ్డు రవాణా వైపు మారడం పెరిగింది. దీన్ని సమతుల్యం చేసేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ తగిన విధాన మార్పులు చేయాలని ఆయన సూచించారు.సరుకు రవాణా (గూడ్స్) రైళ్ల వేగాన్ని పెంచడం:లి సరుకు రవాణా రైళ్ల తక్కువ వేగం రవాణా సమర్థతపై ప్రభావం చూపుతుంద ని పేర్కొంటూ, గంటకు 50 కి.మీ. సగటు వేగం లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. ఇది సరుకు రవాణా సమయాన్ని గణనీయంగా తగ్గించి, మెరుగైన లాజిస్టిక్స్‌కు దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రధాన రంగాలైన గనులు, పెట్రోకెమికల్స్, సిమెంట్, ఉక్కు, ఎరు. వులు, టెక్స్టైల్స్, డ్రై పోర్ట్స్, మరియు భారత ఆహార సంస్థ సరఫరా వ్యవస్థకు అనుగుణంగా, విశ్లేషణాత్మక రైల్వే భౌగోళిక అంచనాలను చే పట్టి కారిడార్ లను సమర్థవంతంగా ప్రణాళి కాబద్ధంగా అభి వృద్ధి చేయాలని సూచించా రు.సౌత్ కోస్ట్ రైల్వే జోన్ త్వరితగతిన ప్రారంభిం చాలి భరత్ సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు టెండర్లను పిలవడాన్ని హర్షిస్తూ, జనరల్ మేనే జర్ మరియు డివిజనల్ రైల్వే మేనేజర్ నియా మకాల్ని త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖను కోరారు.రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు సరుకు రవా ణా సామర్థ్యం పెంపుకు తాను ఎల్లప్పుడూ కట్టు బడి ఉంటానని పేర్కొన్న భరత్, సరుకు రవాణా వ్యూహాన్ని మెరుగుపరచడం,



వేగవంతమైన సరుకు రవాణా సేవలు అందించడం, పోటీ ధరలను అమలు చేయడం ద్వారా భారతీయ రైల్వేను సరుకు రవాణాలో మొదటి స్థానం లో మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్కి కృతజ్ఞతలు

- విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన వంశీకృష్ణ శ్రీనివాస్కి
- విశాఖ ప్రజలు మరియు ప్లాంట్ కార్మికుల తరపున కృతజ్ఞతలు తెలిపిన డా. మొహమ్మద్ సాదిక్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 18** :రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి మాజీ సభ్యులు, విశాఖపట్నం జీవీఎంసీ 39వ వార్డ్ కార్పొరేటర్ డా. మొహమ్మద్ సాదిక్, అసెంబ్లీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యలపై ప్రస్తావించిన తీరు గొప్ప ప్రశంసనీ యం అని పేర్కొంటూ,విశాఖ ప్రజలు మరియు ప్లాంట్ కార్మికుల తరపున ఆయనకు కృతజ్ఞ తలు తెలిపారు.డా. సాదిక్ మాట్లాడుతూ, విశాఖ ఉక్కు కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాదు, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆర్థిక, భావోద్వేగ అడుగుజాడ అని పేర్కొన్నారు. "విశాఖ ఉక్కుఆంధ్రుల హక్కు" నినాదంతో ప్రారంభమైన ఈ ప్లాంట్ కోసం అమృతరావు, తెన్నేటి విశ్వనాథం గారు వంటి అనేక మహానుభావులు చేసిన త్యాగాలు మరువలేనివని, వారి కలను కాపా డేందుకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు అసెంబ్లీలో గళమెత్తడం అభినందనీయమని అన్నారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పష్టమై న అవగాహన, తన ప్రాంతానికి న్యాయం చే యాలనే పట్టుదల, ప్రజా ప్రయోజనాలను కాపాడే విధంగా అసెంబ్లీలో గట్టిగా పోరాడిన తీరు ప్రశంసనీయం అని డా. సాదిక్ అన్నారు. స్టీల్ ప్లాంట్ సమస్యను ప్రాధాన్యతతో ప్రస్తావి స్తూ, దీనికి ప్రధాన కారణాలను కచ్చితంగా ఉద్ఘాటించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం చేస్తు న్న కృషిని ప్రజలకు తెలియజేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు.ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్థిరమైన వైఖరి వల్లే స్టీల్ ప్లాంట్ అంశం అసెంబ్లీలో తీవ్ర చర్చకు దారి తీసింది, తద్వారా ప్రభుత్వాన్ని మరింత కదిలించే అవ కాశం లభించిందని అన్నారు. ఆయన కృషి, నిబద్ధత చూస్తుంటే స్టీల్ ప్లాంట్ భవిష్యత్తుపై ప్రజలకు విశ్వాసం కలుగుతోందని, తద్వారా స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారానికి మరింత దారితీసేలా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.డా. సాదిక్, కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ పునరుజ్జీవానికి తీసుకుంటున్న చర్య లను సమర్థిస్తూ, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్లాంట్‌ను తిరిగి ఆదుకునేందుకు విద్యుత్తు, మాంగనీస్ వంటి సహాయాన్ని అందిస్తున్నప్పటికీ, కేంద్రం ఐరన్ ఓర్, కుకింగ్ కోల్ వంటి కీలక ముడిసరు కుల సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా, విశాఖ ఉక్కు ప్లాంట్ మనుగడ కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్మిక సంఘాలు, ప్రజలు ఐక్యం గా నిలబడాలని డా. సాదిక్ పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఈ సమస్యను ప్రాముఖ్యత తో తీసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని, స్టీల్ ప్లాంట్‌ను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.

## గాంధలో తాగునీటి సౌకర్యం కల్పించాలి.



సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స.

**డుంబ్రిగుడ: పెన్ పవర్ మార్చి 18:** మండలంలోని కితలంగి పంచాయతీ మారుమూల గ్రామమైన గాందలో తాగునీటి సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి అప్ప నర్స డిమాండ్ చేశారు. సిపిఎం చేపడుతున్న ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం కితలంగి పంచాయతీ గాంధ గ్రామంలో సందర్శించి ప్రజలతో కలిసి సమస్యలను అడిగి తెలుసుకుని, కాలి బిందెలతో రోడ్డుపై ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధ గ్రామంలో 70 కుటుంబాలు ఉండగా సుమారు 350 మంది జనాభా కలిగి ఉన్నారని, మంచినీరు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురి అవుతున్నారని చెప్పారు.ప్రభుత్వం, అధికారులు వెంటనే జోక్యం చేసుకొని తక్షణమే మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్డు సౌకర్యం కూడా లేనందున మధ్యలో ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చైతన్య యాత్రలో వచ్చిన సమస్యలను ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి ఐక్యంగా ముందుకు కదలాలని ఆయన పిలుపునిచ్చారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అపార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బి. పోతురాజు, ఆ పార్టీ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణాలలో పటిష్టమైన నాణ్యతలు పాటించాలి







- భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయండి
- ఐ.టీ.డీ.ఏ ఇన్చార్జి పీవో,జెసి డాక్టర్ ఎం.జె అభిషేక్ గౌడ

**పాడేరు,పెన్ పవర్ మార్చి 18.** అల్లూరి జిల్లాలో ప్రధానమంత్రి జన్ మన్ ప్రోగ్రాంలో రూ.(1 కోటి 20)లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రెండు మల్టీపర్పస్ కేంద్రాలను ఐ.టి.డి.ఏ ఇంచార్జ్ ప్రాజెక్టు అధికారి,జె.సి డాక్టర్ ఎం.జె అభిషేక్ గౌడ మంగళవారం పరిశీలించారు. పాడేరు మండలం ముంతమామిడి,రణం బడి గ్రామాల్లో పర్యటించి భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రణం బడి మల్టీపర్పస్ సెంటర్ ను రెండు నెలల పూర్తి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా ముంతమామిడి మల్టీపర్పస్ కేంద్రాన్ని రెండు వారాల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భవన నిర్మాణాలలో పటిష్టమైన నాణ్యతలు పాటించాలని సూచించారు.ఒక్కొక్క భవనానికి రూ 60 లక్షలు వ్యయం ఇస్తున్నామని చెప్పారు నాణ్యతలలో ఎక్కడ రాజీ పడొద్దు అని స్పష్టం చేశారు.మల్టీ పర్పస్ కేంద్రాల్లో హెల్త్ సెంటర్,అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పారు.అనంతరం గ్రామస్తులతో మాట్లాడి గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తాగునీటి సమస్యలపై ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిఈ రవికుమార్,ఏ ఈ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ భద్రతపై అవగాహన కల్పించడం





- సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్ను జెండా ప్రారంభించిన పోర్ట్ చైర్ పర్సన్
- నగరంలోని విద్యార్థులు తమ సైకిళ్లతో ర్యాలీ
- తూర్పు మరియు పడమటి తీర ప్రాంతాలను కవర్ చేస్తూ 6553 కిలోమీటర్ల

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 18** :సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ను విశాఖపట్నం పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ డా.ఎం.అంగ ముత్తు జెండా ఊపి ప్రారంభించారు తూర్పు తీరంలో నిర్వహిస్తున్న ర్యాలీ నిన్న శ్రీకాకుళం నుంచి విశాఖ చేరు కుంది విశాఖ చేరుకున్న బృందానికి పోర్ట్ చైర్ పర్సన్ , విశాఖ జిల్లా కలెక్టర్లు ఘనం గా స్వాగతం పలికారు రాత్రి విశాఖ లో బస చేసిన ర్యాలీ బృందం ఉదయం ఇక్కడినుంచి బయలు దేరి అన్నవరం వెళ్లనున్నారు ఈ బృం దానికి పోర్ట్ చైర్పర్సన్ జెండా ఊపి సాగనంపా రు సిఐఎస్ఎఫ్ 56వ రైజింగ్ డే ను పురస్కరిం చు కొని ఈ సైక్లోథాన్ ని ప్రారంభించారు ఈ సైక్లోథాన్‌ను కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా మార్చి 7న అరకోణం, తమిళనాడు నుండి వర్చువల్‌గా ఫ్లాగ్ ఆఫ్ చేశారు ఈ సైక్లోథాన్ మార్చి 31న వివేకానంద రాక్ మెమోరియల్ కన్యాకుమారి వద్ద ముగియనుంది ఈ సైక్లోథాన్ భారత తూర్పు మరియు పడమటి తీర ప్రాం తాలను కవర్ చేస్తూ 6553 కిలోమీటర్ల తీర రేఖను పూర్తి చేయనుంది ఈ సైక్లోథాన్ ముఖ్య ఉద్దేశ్యం తీర ప్రాంత ప్రజలకు జాతీయ భద్రతపై అవగాహన కల్పించడం ఉగ్రవాదం మాదక ద్రవ్యాలు, ఆయుధాలు స్పోటక పదార్థాలు వంటి ప్రమాదాలపై చైతన్యం కల్పించడం తీర భద్రతను మెరుగుపరిచేందుకు స్థానిక సమాజం మరియు భద్రతా సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం యువతలో మాదకద్రవ్యాల వినియోగ ప్రమాదాలు మరియు తీర ప్రాంత భద్రత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం సైక్లొథన్ కు మద్దతుగా నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ సైకిళ్లతో ర్యాలీలో పాల్గొన్నారు






## హుకుంపేట కేంద్రంలో పశు వులకు గాలికుంటు టీకాలు



**హుకుంపేట,పెన్ పవర్ మర్చి 18.** రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల1 నుండి 31వ తేది వరకు నిర్వహించే గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.నరసింహులు,సూకూరు పంచాయతీ,పరిధిలో గల ములుశోభా గ్రామంలో గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమంలో పాలుగోన్నారు.ఈ కార్యక్రమం లో ములుశోబా గ్రామంలో 27 పశు వులకు అనంతకాలంలో టీకాలు వేశామని ఆయన తెలియజేశారు.ఇప్పటివరకు. మండలంలో (13332) పశువులకు గాలికుంటు టీకాలు వేసామని ఆయన పత్రిక విలేకరుల సమావేశంలో తెలియజేశారు

ఈ కార్యక్రమంలో హుకుంపేట పశు వైద్య అధికారి డా.కె. చరణ్,వి.ఏ.సి హెచ్ ప్రశాంత్ సచివాలయం సిబంది పాడి రైతులు పాలుగోన్నారు.

## హుకుంపేట సి.ఐ.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో సంకల్ప కార్యక్రమం






**హుకుంపేట,పెన్ పవర్ మర్చి 18.** అల్లూరి జిల్లా హుకుంపేట మండలంలో సూకూరు గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో సి.ఐ సన్యాసి నాయుడు సంకల్ప కార్యక్రమం నిర్వహించరు. ఈ సందర్భంగా. ఆయన పత్రిక విలేకరులు సమావేశంలో మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్,మద్యం, నాటు సారా, సేవించడం వల్ల కలిగే నష్టాలు గురించి అలాగే ఫోక్సో,చట్టం గురించి క్షుణ్ణంగా వివరించారు.ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డి.ఐ.జి .ఆదేశాల మేరకు జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో ప్రతి స్కూల్ మరియు కాలేజీల్లో ఈ సంకల్ప ప్రోగ్రాం అనేది నిర్వహిస్తూవస్తున్నాం అని తెలిపారు.డ్రగ్స్ గంజాయికి బానిసలు అయితే విద్యార్థి యొక్క జీవితంపై ఏవిధంగా దుష్ప్రభావితం.అవుతుందని. నిపుణులు ఇచ్చిన వివరాలను. పిల్లలతో చదివించి పిల్లలకు అర్థమయ్యేల వివరంగా తెలియజేసారు.

## గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేసిన ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ.




**అరకులోయ పెన్ పవర్ 18**:అల్లూరి సీతారామరాజు జిల్లా ఆరకులోయ మండలం లోతేరు పంచాయతీ ఆడారి దడదడవలస గ్రామంలో వృదులకు వితంతులకు ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం గిరిజన పేద రైతులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 18 మంది మహిళలకు 18 మంది పురుషులకు ట్రైబల్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చీరలు, దుప్పట్లు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ముఖ్య అధితులు సంస్థ చైర్మన్ పట్టాసి దీప్తి మాట్లాడుతూ ప్రతి కుటుంబల కష్టాలు బాధలు గుర్తించి ఈలాంటి కార్యక్రమం చేసి గిరిజన కుటుంబలతో ఈ విదంగా కలిసి ఉండడం నాకెంతో ఆనందంగా ఉందని యాక్తపరిచారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ కిల్లో అప్పలస్వామి వి సి బికారి అందుబాటులో ఉన్న ఆయా ప్రాంత విలేజ్ కోఆర్డినేటర్లు కిల్లో మూర్తి స్వాబి.మంగళయ బోరిబోరి సింహాద్రి జన్ని కామరాజు రాజు చినబాబు, గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీకి రానున్నదంతా గడ్డుకాలమే



**విజయవాడ, మార్చి 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో వైసీపీకి రానున్న కాలమంతా గడ్డుకాలమే. ఎందుకంటే ఇప్పటికే అనేక విషయాలపై విచారణ ప్రారంభించిన ప్రస్తుత ప్రభుత్వం అన్ని విభాగాల్లో జరిగిన అవినీతిపై లోతైన దర్యాప్తు చేయనుంది. అయితే ఆధారాలను స్పష్టంగా సేకరించిన తర్వాత మాత్రమే కేసులు నమోదు చేయనున్నారు. న్యాయస్థానాల్లో వీగిపోకుండా పకడ్బందీగా అగ్రనేతల మెడ చుట్టూ కేసుల ఉచ్చు బిగుసుకునే ఛాన్స్ ఉంది. గత ప్రభుత్వంలో అనుసరించిన లిక్కర్ అమ్మకాలపైనే ఈ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. లిక్కర్ స్కామ్ లో నిందితులను వరసగా అరెస్ట్ లు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ఇప్పటికే ఒక ప్రణాళిక ప్రకారం పోలీసు ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించనున్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో లిక్కర్ అమ్మకాలను ప్రభుత్వమే జరిపింది. నాసిరకం మద్యాన్ని అధిక ధరకు విక్రయించడం, డిజిటల్ పేమెంట్స్ కు అంగీకరించకపోవడం వంటి అంశాలు ఈ విచారణలో కీలకంగా మారనున్నాయి. ప్రయివేటు సిబ్బందిని లిక్కర్ దుకాణాల్లో నియమించి జరిపిన అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం ఎటు వెళ్లిందన్న దానిపై ఇప్పటికే ఆరా తీస్తున్నారు. ఈ కేసులో ప్రధానంగా ఇటీవల మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేరును కూడా బయటపెట్టారు. ఆయనలే లిక్కర్ వ్యాపారంలో కీలకంగా వ్యవహరించారని సాయిరెడ్డి ఆరోపించారు. మద్యం కుంభకోణంలో కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కీలక పాత్ర పోషించారంటూ సాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఇప్పుడు ఈ ఫైలు వేగంగా ముందుకు కదులుతుంది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి గత ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా పనిచేశారు. అతనే ప్రధాన సూత్రధారి అంటూ సాయిరెడ్డి చేసిన కామెంట్స్ కోణంలో అధికారులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది. తెర వెనక ఉండి ఆయనే అంతా నడిపించారని, లిక్కర్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఎక్కడకు వెళ్లాయన్నది కసిరెడ్డిని విచారిస్తే ఖచ్చితంగా తెలుస్తుందని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో వైసీపీ అగ్రనేతల ప్రమేయం ఉండే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వ పెద్దలు కొంత ఆలస్యమయినా పకడ్బందీగా కేసును రూపొందించాలని ఆదేశాలు జరీ చేసినట్లు సమాచారం. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి విదేశాల్లోనూ లిక్కర్ షాపులను నడిపిన అనుభవం ఉందని తెలియడంతో ఆయన గత ప్రభుత్వంలో ఈ స్కాంలో కీలకంగా వ్యవహరించారంటున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కు అత్యంత దగ్గరని, ఆప్తుడని కూడా గుర్తించారు. ఈ కోణంలోనే దర్యాప్తు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. కసిరెడ్డి రాజవేఖర్ రెడ్డి దొరికితే మొత్తం వ్యవహారం బయటకు వస్తుందని విచారణ చేస్తున్న అధికారులు భావిస్తున్నారు. కసిరెడ్డి కోసం ఇప్పటికే వేట ప్రారంభమయిందని చెబుతున్నారు. ఆయన దొరికిన వెంటనే మద్యం కేసులో కీలక నేతలను కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేసే అవకాశముందని కూడా అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. డిస్టలరీలు, మద్యం అమ్మకాలు, నాసిరకం మద్యం వంటి అంశాలపై ఇప్పటికే కొంత మేరకు ఆధారాలను సేకరించిన అధికారులు స్పష్టమైన సాక్షాధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. అవి లభించినట్లే ఊహించని పరిణామాలు ఏపీలో జరిగే అవకాశముందని చెబుతున్నారు.

# పవన్ డిఫెన్స్ లో పడిపోయారా



**విజయవాడ, మార్చి 18, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం తాను అనుకున్నది సాధించలేకపోతున్నారు. లక్ష్యం కూడా ఎంత దూరంలో ఉందో తెలియదు. ముఖ్యమంత్రి గా పవన్ కల్యాణ్ ను చూడాలని కాపు సామాజికవర్గం, పవన్ అభిమానులు బలంగా కోరుకున్నారు. కానీ పవన్ కల్యాణ్ లో అటువంటి ఆలోచన లేకపోవడంపై వారిలోనే చర్చ జరుగుతుంది. తాము అనుకున్నది వేరని, ప్రతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు కాపు సామాజికవర్గానికి చెందిన వారుంటారని, ఇక పవన్ కల్యాణ్ కు మద్దతిచ్చినందుకు ప్రత్యేకంగా సాధించింది ఏముందన్న ప్రశ్న ఆ సామాజికవర్గం నుంచి ఈ మధ్య కాలంలో బలంగా వినిపిస్తుంది. వైసీపీ విమర్శలు చేస్తూ కాలం గడిపేసే రోజులు పోయాయి. ఎందుకంటే జగన్ ఇప్పుడు అధికారంలో లేరు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల అమలుపై కూడా పవన్ కల్యాణ్ ప్రశ్నించకపోవడంతో పాటు టీడీపీకి బలమైన మద్దతుదారుగా మారడాన్ని కూడా జనసేన కార్యకర్తల నుంచి సామాజికవర్గం నేతలు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. తాము ఊహించింది ఒకటి.. జరుగుతున్నదొకటిలా తయారయిందన్న నిరాశ నిస్పృహలు వారిలో కనిపిస్తున్నాయి. అయితే తాము ఏ మాత్రం దాచుకోకుండా తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా కుండబద్దలు కొట్టేస్తున్నారు. పదేళ్ల పాటు చంద్రబాబు ముఖ్యమంత్రిగానే కొనసాగుతారని చేసిన పవన్ కల్యాణ్ వ్యాఖ్యల దగ్గర నుంచి ఇటువంటి పరిస్థితి తలెత్తింది.ఇక కాపు, బలిజ సంక్షేమ సేన నేత హరిరామ జోగయ్య కూడా పవన్ కల్యాణ్ ను నేరుగా తప్పుపడుతూ బహిరంగ లేఖను రాస్తున్నారు. ఇది కొంత పవన్ తో పాటు జనసేనకు కూడా ఇబ్బందికరంగా మారింది. రాజధాని నిర్మాణం కోసం వేల కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్న ప్రభుత్వం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అభివృద్ధిపై పవన్ కల్యాణ్ పెదవి విప్పకపోవడంపై జనసేన అధినేత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయి. రాజధాని నిర్మాణం అనేది దశల వారీగా జరగాలని, అంతే తప్ప నిధులన్నీ అక్కడ వెచ్చించి మిగిలిన ప్రాంతాలకు, సంక్షేమ పథకాలను అందించకుండా ప్రజలను మోసం చేయడం కాదా? అని కాపు నేతలే ప్రశ్నిస్తున్నారు.వరసగా అగ్రనేతలు తప్పని కష్టాలు ఇరకాటంలో పెట్టేదే... ఇది కొంత పవన్ కల్యాణ్ ను ఇరకాటంలో పెట్టేదే. ఎందుకంటే పవన్ కల్యాణ్ పై ఎన్నికలకు ముందు వరకూ ఎన్నో హోప్స్ ఉన్నాయి. 2014 నుంచి ఆయన ప్రసంగాలు, ఆవేశపూరిత పంచ్ లు విని ఊగిపోయిన వారు నేడు జరుగుతున్న తీరు చూసి ఉసూరుమంటున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలోనే అర్థమవుతుంది. ఎఫెన్స్ లో ఉంటేనే పవన్ కల్యాణ్ ఇమేజ్ పెరుగుతుంది తప్పించి, డిఫెన్స్ లో ఉంటే ఖచ్చితంగా డ్యామేజీ అవ్వకతప్పదని అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. మొత్తం మీద పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన తర్వాత వేరే లెవెల్లో ఉంటుందని అంచనా వేసిన వారికి నేడు ఆయన నుంచి వస్తున్న స్పందన చూసి డల్ అయినట్లే కనిపిస్తుంది.

# గుంటూరు వైసీపీలో ప్రత్యేక కుంపట్లు



**గుంటూరు, మార్చి 18, పెన్ పవర్:** కావటి తప్పుకోవడంతో మిగిలిన వైసీపీ లీడర్లలో అయోమయంగుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా కావటి మనోహర్ నాయుడు రాజీనామా చేశారు.. కలెక్టర్ కి తన రిజైన్ లెటర్ పంపించారు మనోహర్ నాయుడు. ప్రస్తుతం కావటి రాజీనామా వ్యవహారం గుంటూరు రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కావటి కార్పొరేషన్‌లో తనకు తీవ్ర అవమానం ఎదురవుతోందని.. వాపోయారు. ఈ అవమానాలు, నిందలు, పరాభవాలను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం తనకు లేదని అన్నారు. తాను ఎదుర్కొన్న అవమానాలు, పరాభవాలు గతంలో ఏ మేయర్ గానీ, ఏ ఛైర్మన్ గానీ చూసి ఉండరని చెప్పుకొచ్చారు.ఫ్యూచర్ లో ఇలాంటి పరిస్థితి మరెవరికీ రాకూడదని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు కావటి. పార్టీ మార్పు పైనా క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోన్న పరిస్థితుల్లో తాను జగన్ తోనే ఉన్నట్టుగా చెప్పుకొచ్చారు.ఇవన్నీ ఇలా ఉంటే.. కావటి ఈ నిర్ణయం తీస్కోవడం వెనక అసలు సమస్యేంటని చూస్తే.. 2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ పార్టీ నుంచి కావటి మనోహర్ నాయుడు మేయర్ గా ఎన్నికైన సంగతీ తెలిసిందే. ఇంకో ఏడాది పాటు పదవిలో కొనసాగాల్సి ఉంది కావటి మనోహర్ నాయుడు. ఈలోపే ఆయన తన పదవి నుంచి తప్పుకోవడంలో అసలు కారణం.. స్టాండింగ్ కమిటీ వ్యవహారశైలిగా చెప్పుకుంటున్నారు. కొందరు వైసీపీ కార్పొరేటర్లు.. టీడీపీ, జనసేన తీర్థం పుచ్చుకోవడం వల్ల.. కమిటీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు ఆ రెండు పార్టీలకే దక్కాయి. ఈ కమిటీకి మేయరే ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నా.. ఆయనకు తగిన సమాచారమివ్వడం లేదని సమాచారం. ఇందులో మనోహర్ నాయుడిపై అవిశ్వాసం సైతం పెట్టే అవకాశాలు కనిపిస్తున్నట్టు చెబుతున్నారు. స్టాండింగ్ కమిటీలో వైసీపీకి మెజార్టీ లేక పోవడం వల్ల.. ఈ తీర్మానం కూటమి నెగ్గడం ఒక లాంఛనంగా భావిస్తున్నారు. అందుకే కావటి ఇలా అర్థాంతరంగా ఎవరికీ చెప్పకుండానే రిజైన్ చేసినట్టు అంచనా వేస్తున్నారు.మేయర్ గా కావటి మనోహర్ నాయుడు రాజీనామా ప్రకటన ఇటు వైసిపి వర్గాల్లోనే కాదు.. అటు టిడిపి నేతల్లోనూ షాకింగా మారిందట. ఈ హఠాత్ పరిణామానికి ప్రత్యర్థి వర్గాల్లోనూ చర్చకు తెరలేపిందట. ప్రస్తుతం నడుస్తున్న రెడ్ బుక్ రాజ్యాంగంలో.. తనకు కనీస ప్రోటోకాల్ ఇవ్వడం లేదనీ. ఆఫీసు సిబ్బంది ఎప్పుడు వస్తారో రారో కూడా తెలియని గందరగోళ పరిస్థితుల్లోనే తాను రిజైన్ చేస్తున్నట్టు చెబుతున్నారాయన.అయితే ఇలాంటి చిన్న చిన్న విషయాలకే రాజీనామా చేయాల్సిన అవసరమేంటన్నది ఇప్పుడో ప్రశ్నగా మారింది. కనీసం తన సొంత పార్టీ లీడర్లతో కూడా ఆయన సంప్రదింపులు జరిపినట్టే కనిపించడం లేదని అంటున్నారు. జిల్లా అధ్యక్షుడు అంబటి తో కూడా చెప్పినట్టు లేదని చెబుతున్నారు. ఇదెక్కడి విడ్డూరమో అర్థం కావడం లేదని వాపోతున్నారట సగటు గుంటూరు వైసీపీ కార్యకర్త.మేయర్ రాజీనామా పూర్తి వ్యక్తిగతంగా కనిపిస్తోందనీ ఒక అంచనాకు వస్తున్నారు. ఇటు మేయర్ రాజీనామా ప్రకటన వెనక కూటమి నేతల మైండ్ గేమ్ కూడా ఉందని అంటున్నారు. ఈ మేరకు వీరు సక్సెస్ అయినట్టుగానూ భావిస్తున్నారు. మేయర్ పీఠంపై ఇప్పటికే కూటమి నేతల్లో కొందరికి కుతూహలం పెరిగినట్టు సమాచారం. మెజార్టీ జఅఖ కార్పొరేటర్లు కూటమిలోకి రప్పించేందుకు ఓ సీనియర్ కార్పొరేటర్ పెద్ద ఎత్తున ప్రణాళికలు రచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతోనే మేయర్ ముందుగా రాజీనామా ప్రకటన చేశారనీ లెక్కిస్తున్నారు. దీంతో కొత్త మేయర్ ఎన్నిక నల్లేరు పై నడకేనని ఫీలవుతోందట సదరు కూటమి నేత వర్గం.ఇటు కూటమి టచ్ లో ఉన్న వైసీపీ లీడర్ల సంగతి అలా ఉంచితే.. పార్టీనే నమ్ముకున్న వారి పరిస్థితేంటన్నది అయోమయంగా మారిందట. తమకెంతో కావలిగా ఉంటాడని భావించిన మనోహర్ నాయుడు.. ఇలా చేతులెత్తేడం ఏమీ బాగోలేదని లోలోన కుమిలిపోతున్నారట. ఆయన భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందో లేదో తెలీదు కానీ తమ పరిస్థితి మాత్రం కుడితిలో పడ్డ ఎలుకలా తయారైందని వాపోతున్నారట.

## కే రన్ ప్రారంభించిన మంత్రి జూపల్లి

**రంగారెడ్డి: పెన్ పవర్:** నిత్య వ్యాయామంతోనే ఆరోగ్యం సాధ్యమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కూకట్పల్లి ఆల్విన్ కాలనీ తులసి వనం వద్ద అవని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 కే రన్ కార్యక్రమాన్ని మంత్రి, టూరిజం శాఖ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్న జీవితంలో ఏ పని చేయాలన్నా ఆరోగ్యమే ప్రథమం. అందుకే ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలి, అని సూచించారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని, ఆరోగ్య ప్రాధాన్యతను ప్రజల్లో పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు. అలాంటి సంస్థలకు ప్రభుత్వ సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## ఔట్ సార్సింగ్ ఉద్యోగుల నిరసన

**కాకినాడ: పెన్ పవర్:** డా.ఎన్టీఆర్ వైద్య సేవలో పనిచేస్తున్న ఫీల్డ్ లెవెల్ సిబ్బందికి ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లూరి బంగారు శ్రీ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వంచర్ల వీరభద్రరావు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి.. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డా. ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ సిబ్బందికి అంతర్గత ప్రమోషన్ కల్పించాలని.ఉద్యోగ వ్యక్తి మరణిస్తే కుటుంబ సభ్యులకు 15 లక్షలు ఎక్స్ గ్రేషియా, రిటైర్డ్ బెనిఫిట్స్ 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు... ఈనిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆరోగ్య మిత్రలు పాల్గొన్నారు...

## భోగాపురం ఎయిర్ పోర్టులో అపశృతి

**విజయనగరం, మార్చి 18 పెన్ పవర్:** విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. నిర్మాణ పనుల్లో ప్రమాద ఘటనలో ఓ వ్యక్తి చనిపోయాడు. భోగాపురం విమానాశ్రయం లోపల రహదారుల నిర్మాణం చేపడుతున్నారు. అయితే రోడ్ల నిర్మాణానికి బండరాళ్లు అడ్డుగా రావటంతో వాటిని తొలగించే పనులు చేపట్టారు. అందులో భాగంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం లోపలి ప్రాంతంలో బండరాళ్లను బాంబులు పెట్టి పేల్చేందుకు ప్రయత్నించారు. అయితే ఈ సమయంలో ఒక్కసారిగా బ్లాస్టింగ్ జరగటంతో రామచంద్రపేటకు చెందిన బోర కొత్తయ్య అనే వ్యక్తి చనిపోయాడు. ఘటనలో బోర కొత్తయ్యకు తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2026 జూన్ నాటికి అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే భోగాపురం ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేస్తూ 15 రహదారుల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. ఈ విషయాన్ని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని నియోకజవర్గాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. ప్రతిపాదించిన 15 రహదారుల్లో ఇప్పటికే మారికవలస రహదారి నిర్మాణం పూర్తైందని వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ వెల్లడించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి మిగతా వాటిని పూర్తిచేస్తామన్నారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని 2200 ఎకరాలలో నిర్మిస్తున్నారు. మూడు దశల్లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు చేపడుతున్నారు. మొదటి దశలో ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెండో దశలో ఈ సంఖ్యను రెట్టింపు చేయనున్నారు. ఇక మూడో దశలో మరో 60 లక్షల మంది ప్రయాణికులు అంటే.. ఏడాదికి కోటీ 80 లక్షల మంది రాకపోకలు సాగించేలా ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని పెంచనున్నారు. రూ.4592 కోట్లతో మొదటి విడత పనులు చేస్తున్నారు. 2023 మే నెలలో ఈ పనులకు శంకుస్థాపన జరగ్గా.. వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేలా కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది.

## సామర్లకోట దగ్గర ఆర్వోబీ

**రాజమండ్రి, మార్చి 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా స్టేట్ హైవేలు, నేషనల్ హైవేలు, బ్రిడ్జిలు, ఆర్వోబీలు, ఫ్లై ఓవర్లపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కీలకమైన ఆర్వోబీకి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఇకపై గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పని లేకుండా.. సామర్లకోట రైల్వే గేటు దగ్గర వాహనదారుల నిరీక్షణకు తెర పడనుంది. రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)కి కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు భూ సేకరణతో పాటుగా పలు ఇతర అంశాలపై అధికారులు ఫోకస్ పెట్టారు.ప్రతి రోజూ రాజమహేంద్రవరం, కాకినాడ మార్గాల నుంచి వచ్చే వాహనాలు సామర్లకోట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఇన్ని రోజులు ఈ రాకపోకలు సాగించడానికి కష్టాలుపడ్డారు.. ఆర్వోబీ రావడంతో వాహనదారులకు విముక్తి కల్పించడానికి ఆర్వోబీ నిర్మించేందుకు కేంద్రం ఓకే చెప్పింది. గతంలోనే రైల్వే గేటు దగ్గర బ్రిడ్జి నిర్మించాలని ప్రజాప్రతినిధులు కేంద్రాన్ని కోరారు, ప్రతిపాదనలుకూడా పంపారు. కాకినాడ జనసేన పార్టీ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సామర్లకోట ఆర్వోబీ గురించి చర్యలు తీసుకోవాలని ఇటీవల కోరడంతో రైల్వే శాఖ నుంచి సానుకూలత వచ్చింది.ఈ ఆర్వోబీ అందుబాటులోకి వస్తే.. రైల్వే గేటు దగ్గర వాహనదారుల నిరీక్షణకు చెక్ పడుతుందంటున్నారు. ఈ మేరకు ఆర్వోబీ నిర్మించడానికి స్థల సేకరణ చేయాలని, పనులకు సంబంధించి ప్రతిపాదనలు సమర్పించాలని రైల్వే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. 'గేటు సకాలంలో పడకపోవడం వల్ల సిగ్నల్ వ్యవస్థకు ఇబ్బంది కలిగేది.. ఫలితంగా రైళ్ల రాకపోకలకు సాంకేతిక సమస్యలు ఎదురయ్యేవి. త్వరలో నిర్మించే ఆర్వోబీతో ఈ ఇబ్బందులు తొలగుతాయని' అన్నారు. ఈ ఆర్వోబీ పూర్తి చేస్తే వాహనదారుల కష్టాలు తొలగిపోతాయంటున్నారు.ఈ సామర్లకోట రైల్వే గేటు దగ్గర ప్రజలునిత్యం నరకం అనుభవిస్తున్నారు.. గేటుపడితే చాలు వాహనాలు మొత్తం అక్కడ నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలోనే ఎప్పటి నుంచో ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలనే డిమాండ్ వినిపిస్తోంది. మొత్తానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## నల్లమలలో యురేనియం తవ్వకాలు.. అందోళనలో స్థానికులు

**నల్గొండ: పెన్ పవర్:** పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి మధ్య జరుగుతున్న ఒక కీలకమైన పోరాటంకు నల్లమల ప్రజలు సిద్ధమవుతున్నారు.తమ ఉనికి కే కాదు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు పెను ప్రమాదం పొంచివుందని స్పష్టం చేస్తున్నారు.నల్లమల అడవుల్లో యురేనియం నిల్వలు ఉన్నట్లు తెలుసుకున్న కేంద్ర ప్రభుత్వం నిక్షేపాలను గుర్తించేందుకు అనుమతి ఇచ్చింది.నల్లమల అడవిలోని కుంచోని మూల నుంచి పదర వరకు మొదటి బ్లాక్లో 38 చదరపు కిలో మీటర్లు, పదర నుంచి ఉడిమిల్ల వరకు రెండో బ్లాకులో మరో 38 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో నాలుగు వేల బోర్లు వేసి, నమూనాలు సేకరించేందుకు భారత అణుశక్తి సంస్థ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ మేరకు అనుమతులు రావడంతో నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ కు ఎగువభాగంలో అచ్చంపేట, అమ్రాబాద్ అటవీశాఖ అధికారులు,అణు సిబ్బంది కలిసి వారం రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. డ్రిల్లింగ్యంత్రాలు తీసుకు వచ్చేందుకు రూట్మ్యాప్ సిద్ధం చేశారు.నల్లమల అభయారణ్యం లో యురేనియం అన్వేషణ, వెలికితీత కు ప్రత్యేక హెలిక్యాప్టర్ లు రంగంలోకి దింపారు.సమీప గ్రామాల ప్రజలకు తెలియకుండానే ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ఆలస్యంగా తెలుసుకున్న అ ప్రాంత ప్రజలు పచ్చని అడవిలో విధ్వంసం సృష్టించొద్దంటు పోరాటానికి పిలుపు నివ్వడంతో యూరినియం నిక్షేపాల వెలికితీత అంశంకు తాత్కాలిక బ్రేక్ పడింది.నల్లమల అడవులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. ఇవి తూర్పు కనుమల్లో భాగం. ఇక్కడ అరుదైన వృక్ష, జంతు జాతులు ఉన్నాయి. ఈ అడవుల్లో చెంచు గిరిజనులు నివసిస్తున్నారు. ఈ అడవులు కృష్ణా నదికి నీటిని అందించే ప్రధాన వనరు. నాగార్జున సాగర్ డ్యామ్ కు ప్రధాన నీటి వనరు ఈ అడవులే. ఇక్కడ యురేనియం తవ్వకాలు జరిగితే, ఈ అడవులు, గిరిజనుల జీవనం, కృష్ణా నదిపై ఆధారపడిన లక్షలాది మంది జీవితాలు ప్రమాదంలో పడతాయి." యురేనియం వెలికితీత ఈ ప్రాంత జీవ వైవిధ్యానికి, తెలుగు జాతికి, ప్రజల ఆరోగ్యంపై కూడా ఎన్నటికీ తీరని చేటు చేస్తుందని స్థానికుల అందోళన.

# వారిద్దరూ తప్ప మిగిలిన వారు దండగ: టీమిండియా బ్యాటర్లపై గంగూలీ ఆందోళన




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా ప్రస్తుతం ఫుల్ జోష్ లో ఉంది. ప్రస్తుతం భారత క్రికెట్ జట్టును ఓడించాలంటే ఏ జట్టుకైనా సవాలే. 9 నెలల వ్యవధిలో రెండు ఐసీసీ టైటిల్స్ గెలిచిన టీమిండియా భవిష్యత్తులో ప్రపంచ క్రికెట్ ను శాసించే స్థాయికి చేరుకున్నా ఆశ్చర్యం లేదు. బెంచ్ కూడా చాలా బలంగా కనిపిస్తుంది. రానున్న 10 సంవత్సరాలు భారత క్రికెట్ జట్టు సేఫ్ జోన్ లో ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఓడిపోయిన భారత్.. ఆ తర్వాత వరుసగా టీ20 వరల్డ్ కప్.. ఇటీవలే ఛాంపియన్స్ ట్రోఫీలో ఒక్క మ్యాచ్ ఓడిపోకుండా టైటిల్స్ గెలిచింది.

ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచి ఊపు మీదున్నప్పటికీ అంతకముందు ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ సిరీస్.. స్వదేశంలో న్యూజిలాండ్ పై క్లీన్ స్వీప్ కావడం ఆందోళన కలిగించే విషయాలు. ఈ రెండు సిరీస్ లలో బ్యాటర్ల వైఫల్యమే కారణం. ఈ సిరీస్ ఓటములతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ అవకాశాలను చేజార్చుకుంది. వైట్ బాల్ ఫార్మాట్ లో టీమిండియాకు తిరుగులేకపోయినా రెడ్ బాల్ క్రికెట్ లో మాత్రం తడబడుతున్న మాట వాస్తవం. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ భారత టెస్ట్ క్రికెట్ బ్యాటర్లపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత స్టార్ బ్యాటర్లు టెస్ట్ క్రికెట్‌లో తమ గేమ్ ను మెరుగు పరుచుకోవాలని గంగూలీ సూచించాడు.

ఇటీవలే ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఇలా అన్నాడు. "మన జట్టు టెస్ట్ క్రికెట్ ఆడుతున్నప్పుడు నాకున్న ఏకైక ఆందోళన ఏమిటంటే విరాట్, యశస్వి తప్పమిగిలిన ఆటగాళ్లకు విదేశాలలో

యావరేజ్ 40 కంటే ఎక్కువ లేదు. జైస్వాల్ స్వదేశంలో ఆడిన తొమ్మిది టెస్టుల్లో 44.18 యావరేజ్ తో స్కోర్ చేశాడు. మరోవైపు కోహ్లీ విదేశాల్లో 66 టెస్టుల్లో సగటున 41.51 గా ఉంది. రాహుల్, శుభ్‌మాన్ గిల్, పంత్ వంటి వారు తమ బ్యాటింగ్ ను పరిశీలించుకోవాలి. మంచి టెస్ట్ జట్టుగా ఎదగాలనుకుంటే.. టాప్ 6 బ్యాటర్లలో ముగ్గురు లేదా నాలుగురు ఆటగాళ్ల సగటు 50కి దగ్గరగా ఉండాలి. గిల్ నాణ్యమైన టెస్ట్ క్రికెట్ ఆడుతూ తన బ్యాటింగ్ ను ఉన్నత స్థితికి తీసుకెళ్లాలి". అని గంగూలీ రెవ్‌స్పోర్ట్జ్‌లో అన్నాడు.

# ఫ్యూచర్ స్టార్ అని సెలక్ట్ చేస్తే వరుస డకౌట్లు.. పాక్ ఓపెనర్‌కు చేదు అనుభవం



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రయోగాలు చేసి న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు వరుస పరాజయాలు పలకరించాయి. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో 0-2 తో వెనకపడ్డారు. ఈ సిరీస్ లో పాకిస్థాన్ యువ ఓపెనర్ హసన్ నవాజ్ తొలి రెండు మ్యాచ్ లకే చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. దేశవాళీ క్రికెట్ లో పవర్ ఫుల్ హిట్టర్ గా పేరొందిన హసన్ ఆడిన రెండు మ్యాచ్ ల్లో డకౌటయ్యాడు. దీంతో ఈ పాకిస్థాన్ ఓపెనర్ తన మొదటి రెండు టీ20 ఇన్నింగ్స్ ల్లో వరుసగా రెండు డకౌట్‌లైన ఆరవ ఆటగాడిగా నిలిచాడు.మాథ్యూ సింక్లైర్ (న్యూజిలాండ్), జో డెన్లీ (ఇంగ్లాండ్), ఇమ్రుల్ కేస్ (బంగ్లాదేశ్), కైల్ జార్విస్ (జింబాబ్వే), అర్షద్ ఇక్బాల్ వారు ఆడిన తొలి రెండు మ్యాచ్ ల్లో డకౌటయ్యారు. తాజాగా నవాజ్ వారి సరసన చేరాడు. నవాజ్ రెండు సార్లు తొలి ఓవర్ లోనే పేసర్ జాకబ్ డఫీ బౌలింగ్ లో ఔటవ్వడం విశేషం. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన తొలి టీ20 మ్యాచ్ కేవలం రెండు బంతులకే డకౌట్ కాగా.. సోమవారం (మార్చి 18) డునెడిన్‌లో జరిగిన రెండో టీ20 లో మూడు బంతులకే పరుగులేమీ చేయకుండా పెవిలియన్ దారి పట్టాడు. ఈ మ్యాచ్ విషయానికి వస్తే 15 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్ లో 136 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 13.1 ఓవర్లలో ఛేజ్ చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 15 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. సల్మాన్ ఆఘా 46 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. షాదాబ్ ఖాన్ (26), షహీన్ అఫ్రిది (22) రాణించారు. లక్ష్య ఛేదనలో సీఫెర్ట్ (45), ఫిన్ అలెన్ (38) చెలరేగడంతో 13.1 ఓవర్లలో 137 పరుగులు చేసి గెలిచింది. ఈ విజయంతో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో న్యూజిలాండ్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 శుక్రవారం (మార్చి 21) జరుగుతుంది.

# ఢిల్లీ క్యాపిటల్స్‌కు కొత్త సమస్య.. ఐపీఎల్‌లో కూడా రాహుల్‌కు అన్యాయం చేస్తారా!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో ఈ సారి ఢిల్లీ క్యాపిటల్స్ మరింత పటిష్టంగా కనిపిస్తుంది. రాహుల్, మిచెల్ స్టార్క్ లాంటి ఆటగాళ్లు జట్టులో చేరడంతో జట్టులో స్టార్ ఆటగాళ్ల సంఖ్య పెరిగింది. మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ సీజన్ లో ఢిల్లీ క్యాపిటల్స్ లో కూడా ఫేవరేట్ జట్లలో ఒకటి. టీమిండియా ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ కెప్టెన్ గా జట్టును నడిపించనున్నాడు. 2025 సీజన్ ప్రారంభ మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తమ తొలి మ్యాచ్ ను సోమవారం (మార్చి 24) లక్నో సూపర్ జయింట్స్ తో తలపడుతుంది. తొలి మ్యాచ్ కు ముందు ఒక విషయంలో ఢిల్లీ ఎటూ తేల్చుకోలేకపోతుంది. అదేంటో ఇప్పుడు చూద్దాం.

ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ కు ముగ్గురు స్టార్ ఓపెనర్లు ఉన్నారు. ఆస్ట్రేలియా యువ ఓపెనర్ జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్‌తో పాటు అనుభవజ్ఞులు డుప్లెసిస్, కేఎల్ రాహుల్ స్క్వాడ్ లో ఉన్నారు. ముగ్గురు కూడా తుది జట్టులో ఉండడానికి అర్హులు. గత సీజన్ లో మెక్‌గుర్క్ తన మెరుపు ఇన్నింగ్స్ లతో ఢిల్లీకి ఆశాకిరణంలా మారాడు. రాహుల్, డుప్లెసిస్ వేరే ఫ్రాంచైజీలు తరపున ఓపెనర్లుగా అద్భుతంగా రాణించిన చరిత్ర ఉంది. దీంతో ఇప్పుడు ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్లు ఎవరనే ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం దొరకడం లేదు. మెక్‌గుర్క్, డుప్లెసిస్ ఇప్పటివరకు ఐపీఎల్ లో ఓపెనర్లుగానే బ్యాటింగ్ చేశారు. మరోవైపు రాహుల్ మాత్రం మూడు, నాలుగో స్థానాల్లో బ్యాటింగ్ చేసిన రికార్డ్ ఉంది. ఢిల్లీ జట్టు రాహుల్ ను తమ వైస్ కెప్టెన్ గా ప్రకటించిన తర్వాత అతను తుది జట్టులో ఉండడం ఖాయమైంది. అదే జరిగితే ఢిల్లీ క్యాపిటల్స్ కు ఈ సీజన్ లో మెక్‌గుర్క్, డుప్లెసిస్ ఓపెనర్లుగా దిగే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. రాహుల్ భారత జట్టు కోసం ఏ స్థానంలో ఆడించినా ఆడాడు. ఐపీఎల్ లో కూడా ఈ స్టార్ బ్యాటర్ మూడో స్థానంలో బ్యాటింగ్ చేసిన ఆశ్చర్యం లేదు. పైగా రాహుల్ ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయగల సమర్థుడు. దీంతో జట్టు కోసం మరోసారి తన ఓపెనింగ్ స్థానాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడతాడేమో చూడాలి.



# కల్కి -2 షూట్ డేట్ ఫిక్స్!

క‌ల్కి -2%-%కి రంగం సిద్దమైందా? నాగ్ అశ్విన్ రెండవ పార్ట్ ని కూడా త్వరిత గతిన పూర్తి చేసే పనిలో పడ్డారా? అంటే అలాగే అనిపిస్తుంది. తొలి భాగం షూటింగ్ చేస్తోన్న సమయంలో రెండవ భాగానికి సంబంధించి 30 శాతం షూటింగ్ పూర్తయిందని ప్రకటించారు. అయితే తాజాగా మిగిలిన 70 శాతం షూటింగ్ కి సంబంధించి నాగీ ప్రణాళిక సిద్దం చేసారు. మే నెల నుంచి చిత్రీకరణ ప్రారంభమవుతుందని సమాచారం.తొలి షెడ్యూల్ అమితాబచ్చన్ పాల్గొంటారు. అటుపై జూన్ లో రెండవ షెడ్యూల్ మొదలవుతుందిట. ఇందులో చాలా మేజర్ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తారుట. ఇందులోనే ప్రభాస్-కమల్ హాసన్ పై కీలక పోరాట ఘట్టాలు చిత్రీకరించనున్నారుట. రెండవ భాగంలో ప్రభాస్ పాత్ర కీలకంగా ఉంటుందని సమా చారం. తొలి భాగంలో ఎక్కువగా అమితాబచ్చన్ పాత్ర హైలైట్ అయిన సంగతి తెలిసిందే.సినిమాలో ప్రభాస్ ఉన్నా? హీరో ఎవరు? అంటే అమితాబ్ గానే భావించారంతా. అంత బలమైన పాత్ర అమితాబ్ పోషించారు. ఈ నేపథ్యంలో రెండవ భాగంలోనూ అమితాబ్ పాత్ర ఎక్కడా తగ్గదని తెలుస్తోంది. సినిమాలో చాలా సన్నివేశాలు ఎంతో యూనిక్ గా ఉండబోతున్నాయట. ఇంత వరకూ ఇండియాన్ స్క్రీన్ పై చూడని ఎన్నో సన్నివేశాలుంటాయం టున్నారు. అలాగే కథ ఎమోషనల్ గానూ కనెక్ట్ అవుతుందిట.ఈ సినిమా ఎలా ఉంటుందన్నది నాగీ ఇప్పటికే హింట్ ఇచ్చారు. సినిమా రిలీజ్ ఆలస్యమైనా ఓ రెండు సినిమాల ప్రభావం ఈ ఒక్క సినిమా కథలోనే ఉంటుందన్నారు. ప్రభాస్ పాత్ర రెండవ భాగంలో అభి మానుల ఊహని మించి ఉంటుందని వెల్లడించారు.



క్లాసిక్ చీరలో ఆషికా రంగనాథ్ స్టన్ చేసింది



రితికా సింగ్ ఆకర్షణీయమైన ఫోటో కలెక్షన్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com